శుక్రవారం
19-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 326
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

భారత్‌కు తహావూర్ రాణా

భారత ఆర్థిక రాజధాని ముంబైలో 26/11 ఘటన నిందితుడు తహావూర్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా న్యాయస్థానం అంగీకరించింది. ఈ మేరకు కాలిఫోర్నియా కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. భారత్-అమెరికా మధ్య ఉన్న నేరస్తుల అప్పగింత ఒప్పందానికి అనుగుణంగా కోర్టు ఈ ఆదేశాలిచ్చింది.

2లో

కిరణ్ రిజిజుకు స్థాన చలనం

ప్రాధాన్యతలేని భూవిజ్ఞాన శాఖ కేటాయింపు

అర్జున్ రాం మేఘ్వాల్‌కు న్యాయశాఖ బాధ్యతలు

న్యూఢిల్లీ:
కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ రిజిజును గురువారం ఆకస్మికంగా న్యాయ శాఖ మంత్రిగా తొలగించి అంతగా ప్రాధాన్యం లేని భూ విజ్ఞాన శాస్త్ర మంత్రిగా నియమించారు. ఆయన స్థానంలో పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రిగా ఉన్న అర్జున్ రాం మేఘ్వాల్‌కు న్యాయ శాఖ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుత ప్రభుత్వ గడువు ముగియడానికి ఏడాది ముందు రిజిజును న్యాయశాఖ మంత్రిగా తొలగించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అర్జున్ రాం మెఘ్వాల్ న్యాయ శాఖ మంత్రిగా కూడా సహాయ మంత్రిగానే పని చేస్తారు. న్యాయ శాఖను సహాయ మంత్రి నిర్వహించడం బహుశా ఇదే మొదటి సారి. న్యాయ శాఖ మంత్రిగా రిజిజు అట్టహాసంగా వ్యవహరించే వారు. ఎక్కడైనా సమస్య ఎదురైనా మోదీ ఆయనకే పరిష్కార బాధ్యత అప్పగించే వారు. న్యాయశాఖ మంత్రిగా రిజిజు ఉన్నప్పుడు ప్రభుత్వానికి న్యాయ వ్యవస్థకు పొసగని పరిస్థితి

- మిగతా 2 లో

వివాదాలే కారణమా...

2లో

సిద్ధూకే పీఠం

కర్నాటక సీఎంపై వీడిన మిస్టరీ

ఉపముఖ్యమంత్రిగా డీకే శివకుమార్

- 20 మందితో కొత్త కేబినెట్!
- రేపు ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ:
కర్నాటకలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నది. ముఖ్యమంత్రి పదవి మరోసారి సిద్ధరామయ్యనే వరించింది. ఉపముఖ్యమంత్రిగా డీకే శివకుమార్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. దీంతో కర్నాటకకు ముఖ్యమంత్రి ఎవరన్న మిస్టరీ వీడింది. కొత్త ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఈనెల 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పార్లమెంటరీ ఎన్నికలు ముగిసేంత వరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ డీకే శివకుమార్ కొనసాగుతారు. అలాగే 20మందితో కూడిన మంత్రిమండలి కూడా శనివారమే ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి పార్టీ అగ్రనాయకత్వం, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి భావసారూప్యతగల పార్టీలన్నింటికి కాంగ్రెస్ ఆహ్వానం పంపింది. బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించనున్నారు. దానికి సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు సిద్ధరామయ్య, శివకుమార్‌లతో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చర్చించిన అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం పేర్లను నిర్ణయించినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విలేకరుల సమావేశంలో తెలిపారు. 20వతేదీ మధ్యాహ్నం 12.30గంటలకు కర్నాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. అదేరోజు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేస్తారని వేణుగోపాల్ చెప్పారు. ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడుతారని, పీసీసీ అధ్యక్ష బాధ్యతలను కూడా ఆయన చేపడతారని, వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల వరకు కాంగ్రెస్ కర్నాటక అధ్యక్షుడిగా ఉంటారని చెప్పారు. కర్నాటక ప్రజలతో అధికారాన్ని పంచుకోవడమే 'పవర్ షేరింగ్ ఫార్ములా' అని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. తమది ప్రజాస్వామిక పార్టీ అని, ఏకాభిప్రాయాన్నే

- మిగతా 2 లో

జల్లికట్టుకు జంతుహింస

చట్టం వర్తించదు

సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ:
తమిళనాడు సంప్రదాయ క్రీడ జల్లికట్టు విషయంలో ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. జల్లికట్టుపై తమిళనాడు చట్టాన్ని అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. జంతు హింస చట్టం ఈ ఆటకు వర్తించదని తెలిపింది. ఈ మేరకు 2014లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాజాగా ఐదుగురు సభ్యుల ధర్మాసనం సవరించింది. తమిళ సంస్కృతిలో జల్లికట్టు ఒక భాగమని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కోర్టు కొట్టేసింది. సంక్రాంతి పండగ సమయంలో తమిళనాడులో ఈ జల్లికట్టు ఆటను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే, ఈ క్రీడపై గతంలో తీవ్ర వ్యతిరేకత రావడంతో 2014లో సుప్రీంకోర్టు జల్లికట్టుపై నిషేధం విధించింది. ఈ క్రీడ జంతువులపై హింస నివారణ చట్టాన్ని ఉల్లంఘించడమేనని అప్పట్లో కోర్టు పేర్కొంది. ఈ నిషేధాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాట పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ క్రమంలోనే జల్లికట్టును ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ టు యానిమల్స్ చట్టం నుంచి తొలగిస్తూ 2016లో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం

- మిగతా 2 లో

ప్రజాస్వామ్యాన్ని పాతరేయాలనుకుంటే

ప్రత్యక్ష ఆందోళన తప్పదు

- అమరావతి రాజధానిపై స్పష్టతివ్వాలి
- పోలవరానికి నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ:
ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కొత్త పద్ధతిలో జీవో నం.1 తీసుకువచ్చి ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తామంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. విజయవాడలోని దాసరి భవన్‌లో గురువారం రామకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు కొట్టేసిన జీవో నం.1ను కొత్త పద్ధతిలో జీవో తీసుకువస్తామని ప్రభుత్వ ప్రధాన సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జీవో నం.1ని రద్దు చేయాలని కోరుతూ సీపీఐతో పాటు టీడీపీ మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు హైకోర్టులో పిటీషన్ వేశారన్నారు అనాటి బీజేపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యారని తెలిపారు. హైకోర్టు వెకేషన్ బెంచ్ స్టే ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సీపీఐతో పాటు ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్‌లు సుదీర్ఘంగా చర్చించిన అనంతరం కోర్టుకు వెళ్లాయి. రాష్ట్ర హైకోర్టు జీవో నం1ను రద్దు చేస్తూ స్పష్టమైన తీర్పు ఇచ్చిందని వివరించారు. జీవో నం.1 తీసుకురావటమే దుర్మార్గమయితే హైకోర్టు తీర్పు తదుపరి కూడా ఆ జీవోలో మార్పులు, చేర్పులు చేసి మరోసారి కొత్తగా తీసుకువస్తామని సజ్జల వ్యాఖ్యానించటంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందనీ, పోలీసులకు పూర్తిగా అధికారం కట్టబెట్టేట్టయితే ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కుర్చీ ఖాళీ చేసి, డీజీపీకి అప్పగిస్తే సరిపోతుందని ఎద్దేవా చేశారు. శాంతియుత ధర్నాలకు, ప్రదర్శనలకు, నిరసనలకు అనుమతి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ఇలా అయితే ప్రజల తరుపున మాట్లాడే అవకాశం ఎక్కడ ఉంటుందని నిలదీశారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారన్నారు. జగన్ పాలనలో ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఇవ్వటం లేదని, కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించటం లేదన్నారు. ఇసుక, మద్యం ద్వారా కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని విమర్శించారు. కోర్టు కొట్టేసిన జీవోలను మరలా తీసుకురావటానికి ప్రయత్నించటం కోర్టు ధిక్కారమేనని, ముఖ్యమంత్రికి కనీస విజ్ఞత ఉండాలన్నారు.

రాజధాని అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొంత మంది అడ్డుపడుతున్నారని ముఖ్యమంత్రి చెప్పడాన్ని రామకృష్ణ తప్పుబట్టారు. రాజధానిగా అమరావతి ఉందా? లేదా? అనే విషయాన్ని సీఎం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరులో విశాఖపట్నం వెళతానని జగన్ చెపుతున్నారని ఆయన విశాఖ వెళ్లితే రాజధానిలో ఎవరు ఉంటారని ప్రశ్నించారు. రాజధానిగా ఉంటేనే

- మిగతా 2 లో

రాజస్థాన్ కాంగ్రెస్‌లో బాహాబాహి

కుర్చీలు విసురుకున్న గెహ్లాత్, పైలెట్ వర్గీయులు

జైపూర్:
రాజస్థాన్‌లోని కాంగ్రెస్ పార్టీ వర్గీయులు బాహాబాహీకి దిగారు. అజ్మీర్‌లో గురువారం అభిప్రాయ సేకరణ కోసం నిర్వహించిన ఫీడ్‌బ్యాక్ సమావేశంలో సీఎం అశోక్ గెహ్లాట్, మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలెట్ వర్గీయులు కుర్చీలు విసురుకున్నారు. జైపూర్‌లోని వైశాలీ నగరంలో ఏఐసీసీ రాజస్థాన్ సహ-ఇంచార్జి అమృతా ధవన్ అధ్యక్షతన 'ఫీడ్‌బ్యాక్' సమావేశం క్రమంలో కూర్చునే ఏర్పాట్లపై పైలెట్, గెహ్లాత్ మద్దతుదారులు గొడవ పడ్డారని క్రిస్టియన్‌గంజ్ పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కరణ్ సింగ్ వెల్లడించారు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారని చెప్పారు.'అజ్మీర్ సరస్ డైయిరీ చైర్మన్ రామచంద్రచూదరి, ఆర్‌టీడీసీ చైర్మన్ ధర్మేంద్ర రాథోడ్‌తో పాటు నాయకుల మద్దతుదారులు సమావేశానికి హాజరయ్యారు. పరస్పరం నినాదాలు చేశారు' అని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు విజయ్ జైన్ తెలిపారు. గెహ్లోట్‌కు పైలెట్‌కు మధ్య చిచ్చు రగులుతూనే ఉన్నది. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో విఫలమైనట్లు గెహ్లోట్ ప్రభుత్వాన్ని పైలెట్ నిందించారు. ఇందుకోసం గెహ్లోట్‌పై చర్యలను ఆయన డిమాండ్ చేశారు. అవినీతిపై

- మిగతా 2 లో

జులైలో చంద్రయాన్-3 ప్రయోగం

బెంగళూరు:
ప్రతిష్ఠాత్మక చంద్రయాన్ -3 ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) చకాచకా ఏర్పాట్లు చేస్తోంది. చంద్రయాన్-3ను జులై రెండవ వారంలో ప్రయోగించాలని నిర్ణయించింది. ఈమేరకు ఇస్రో బెంగళూరు కార్యాలయం సీనియర్ అధికారి గురువారం వెల్లడించారు. మార్చిలో చంద్రయాన్-3 అంతరిక్ష నౌకకు అవసరమైన అన్ని పరీక్షలను ఇస్రో పూర్తిచేసింది. 'సైన్స్ ఫ్రమ్ ది మూన్' థీమ్ ప్రకారం పరిశోధనలకు అనుగుణంగా ఈ మిషన్‌ను చేపట్టినట్లు ఇస్రో అధికారులు తెలిపారు. చంద్రుడిపై పరిశోధనలకు సంబంధించి శాస్త్రీయ పరికరాలు చంద్రయాన్-3లో ఉంటాయి. దీని శక్తిసామర్థ్యాలతో పాటు అంతరిక్షంలోని వాతావరణాన్ని తట్టుకునే విధంగా పరీక్షలు ఇప్పటికే పూర్తి అయ్యాయి.

ఇదీ లోకం!



అయితే ఇక మతం పేరుతో
మీకు ఓట్లు రాలవన్నమాట మీ పార్టీ
గోవిందా గోవింద!

స్పీడు పెంచండి

- సీఆర్‌డీఏ పరిధిలో ఇళ్లపట్టాల పంపిణీ, గృహ నిర్మాణం
- సీఎం జగన్ ఆదేశం
- సుప్రీం తీర్పు బేఖాతరు
- ఆర్-5జోన్‌లో వేగంగా ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
సీఆర్డీయే ప్రాంతంలో పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ చేసిన తర్వాత వేగంగా ఇంటి నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం గృహనిర్మాణంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. రాజధాని పరిధిలోని ఆర్-5జోన్‌లో ఇతర ప్రాంతాలకు చెందిన పేదలకు ఇంటిస్థలాల పంపిణీ అంశం వివాదాస్పదం కావడంతో

రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కార్యాచరణను వేగవంతం చేసింది. హైకోర్టు తుది తీర్పుకు లోబడే ఈ ఇళ్ల పట్టాల పంపిణీ చెల్లుబాటవుతుందని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దానిని పరిగణనలోకి తీసుకోకుండా ఇళ్ల పట్టాలు వేగవంతంగా పంపిణీ చేసి, వాటిలో ఇంటి నిర్మాణాలు కూడా చేపట్టాలన్న ధ్యేయంతో చర్యలు

- మిగతా 2 లో

ఇవేం ఉత్తర్వులు ?

గంగిరెడ్డి బెయిల్ రద్దు తీర్పుపై సుప్రీం విస్మయం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
వివేకా హత్య కేసు నిందితుడు గంగి రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బెయిల్‌ను రద్దు చేసి మళ్లీ ఫలానా రోజున విడుదల చేయాలని ఇచ్చిన ఉత్తర్వులపై సీజేఐ విస్మయం చెందారు. ఇవేం ఉత్తర్వులంటూ అసహనం వ్యక్తం చేస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. వివేకా హత్య కేసులో నిందితుడు ఏ-1 ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు ఉత్తర్వుల షరతును ఆయన కుమార్తె సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. హంతకులు బయట ఉంటే తప్పుడు సంకేతాలు వెళతాయని సునీత పిటీషన్‌లో పేర్కొన్నారు. దీనిపై గురువారం విచారణ చేపట్టిన సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారణను వెకేషన్ బెంచ్‌కు బదిలీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. గంగిరెడ్డి డీఫాల్ట్ బెయిల్ రద్దు చేస్తూ గత నెల 27వ తేదీన తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 30లోగా వివేకా హత్య కేసు దర్యాప్తును పూర్తి చేయాలని సుప్రీంకోర్టు గడువు విధించిన నేపథ్యంలో జులై 1న గంగిరెడ్డిని బెయిల్‌పై విడుదల చేయాలని తన ఉత్తర్వుల్లో హైకోర్టు పేర్కొంది. దీన్ని వ్యతిరేకిస్తూ సునీతారెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. డీఫాల్ట్ బెయిల్‌పై బయట ఉన్నప్పుడు గంగిరెడ్డి తనకు కోర్టు ఇచ్చిన వెసులుబాటును దుర్వినియోగం చేసిన ఉదంతాలు ఉన్నాయని తన పిటిషన్‌లో ఆమె పేర్కొన్నారు. దీనిపై సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ వచ్చేవారం విచారణ జరపనుంది.

భారత్‌కు తహావూర్ రాణా

26/11 నేరస్తుడి అప్పగింతకు అమెరికా కోర్టు ఆమోదం

వాషింగ్టన్: భారత ఆర్థిక రాజధాని ముంబైలో 26/11 ఘటన నిందితుడు తహవూర్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా న్యాయస్థానం అంగీకరించింది. ఈ మేరకు కాలిఫోర్నియా కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. భారత్-అమెరికా మధ్య ఉన్న నేరస్థుల అప్పగింత ఒప్పందానికి అనుగుణంగా కోర్టు ఈ ఆదేశాలిచ్చింది. పాకిస్తాన్ సంతతికి చెందిన కెనడా వ్యాపారవేత్త తహవూర్ రాణా 2008, నవంబరు 26న ముంబై దాడులకు ఆర్థిక సహాయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరొక పాకిస్తాన్ సంతతికి చెందిన అమెరికా ఉగ్రవాది డేవిడ్ కోలెమాన్ హెడ్లీ అలియాస్ దావూద్ గిలానీ కూడా రాణాతో పాటు సహ నిందితుడిగా ఉన్నాడు. గిలానీ ప్రస్తుతం అమెరికా జైల్లో ఉన్నాడు. 2020 జులైలో రణాను అప్పగించాలని కోరుతూ భారత్ ఫిర్యాదు చేసింది. బైడెన్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. 26/11 దాడుల్లో రాణా పాత్రపై ఎన్ఐఏ దర్యాప్తులో భాగంగానే అతడి అప్పగింతను భారత్ కోరగా అమెరికా అంగీకరించింది. రాణాకు గతంలో షికాగో కోర్టు 14ఏళ్ల జైలుశిక్ష కూడా విధించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు డేవిడ్ హెడ్లీకి తహవూర్ రాణా అత్యంత సన్నిహితుడు. భారత్ ఫిర్యాదును యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్ట్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియా మెజిస్ట్రేట్ జడ్జి జాక్వీలిన్ పరిగణనలోకి తీసుకొని అనుకూలంగా తీర్పునిచ్చారు. మొత్తం 48 పేజీల తీర్పును వెలువరించారు.

26/11 దాడులు మూడు రోజుల పాటు జరుగగా మొత్తం 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాదివుంటే, జూన్‌లో భారత ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించనున్నారు. ఇలాంటి తరుణంలో తాజా తీర్పు వెలువడటం చర్చనీయాంశంగా మారింది.

రాబోయే ఐదేళ్లు ఉష్ణవత్సరాలు

ఐరాస ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరిక

దవెల్లే: రాబోయే ఐదేళ్లు ఉష్ణవత్సరాలుగా ఉంటాయని ఐరాస ప్రపంచ వాతావరణ సంస్థ (యూఎన్ డబ్ల్యూఎంఓ) వెల్లడించింది. ఎల్ నీనో, గ్రీన్‌హౌస్ గ్యాసెస్ ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పేర్కొంది. రాబోయే ఐదేళ్లు ఉష్ణవత్సరాలుగానే ఉంటాయి కానీ అందులో ఏదో ఒక సంవత్సరంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు 98శాతం అవకాశాలు ఉన్నట్లు డబ్లూఎంఓ వెల్లడించింది. ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని పేర్కొంది. భూ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ (2.7 డిగ్రీల ఫారెన్‌హీట్) వద్ద నిలువరించకపోతే ప్రపంచమంతటా పర్యావరణ విధ్వంసం పెచ్చరిల్లుతుంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ వద్ద కట్టడి చేయాలని 2015లో పారిస్ వాతావరణ ఒప్పందం చేసుకున్నారు. ప్రపంచ దేశాలు కర్బన ఉద్గారాలను ఆశించిన స్థాయిలో అరికట్టలేకపోతున్నందున 2030 తర్వాత భూ ఉష్ణోగ్రత పెరుగుదల 1.5 డిగ్రీలకు చేరుకొంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఎల్‌నినో, లానినా వల్ల ఇప్పటి నుంచి 2027 వరకు 1.5 డిగ్రీలకు మించి భూతాపం పెరిగే అవకాశముందని డబ్ల్యూఎంఓ పేర్కొంది. 2016లో ఎల్‌నినో రికార్డు ఉష్ణోగ్రతకు కారణమైంది. ఆ రికార్డు ఇప్పటి నుంచి 2027 లోగా బద్దలు కావచ్చు. రాబోయే ఐదేళ్లలో అమెజాన్ అడవుల్లో వర్షాభావం ఏర్పడితే, ఆఫ్రికాలో సహారా ఎడారి దిగువనున్న సాహెల్ ప్రాంతంలో అతివృష్టి ఏర్పడుతుందని, సముద్రాలు వేడెక్కుతాయని అమెరికన్ వాతావరణ శాస్త్రజ్ఞుడు మైఖేల్ మాన్ హెచ్చరించారు.

ఇరాన్, రష్యా మధ్య 10 చమురు సహకార ఒప్పందాలు

టెహ్రాన్: ఇరాన్, రష్యా దేశాల మధ్య పది చమురు సహకార ఒప్పందాలు కుదిరాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో చమురు పరిశ్రమ సహకారానికి సంబంధించిన ఒప్పందాలపై ఇరాన్ చమురు మంత్రి జావేద్ ఓవ్‌జీ, రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నోవక్ వీటిపై సంతకాలు చేశారని, వీరిద్దరు రష్యా, ఇరాన్ కమిషన్ శాశ్వత చైర్‌పర్సన్‌లని అధికారిక ప్రకటన పేర్కొంది. వాణిజ్య, ఆర్థిక సహకారంలో భాగంగా జరిగిన ఒప్పందాల్లో ఆరు అవగాహన ఒప్పందాలు (మౌ) ఉన్నట్లు తెలిపింది. పారిశ్రామిక, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, చమురు రికవరీ మెరుగుదలకు సంబంధించిన ఒప్పందాలు ఉన్నట్లు రెండు దేశాల సంయుక్త విలేకరుల సమావేశంలో ఇరాన్ మంత్రి వెల్లడించారు. చమురు క్షేత్రంలో సమర్థంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. పెట్రోలియం ఎగుమతి దేశాలు (ఒపెక్), ఒపెక్ ప్లస్‌లో రెండు దేశాలు పరస్పరం సహకరించుకుంటున్నట్లు జావేద్ ఓవ్‌జీ వెల్లడించారు. కొత్త ఒప్పందాలు త్వరలోనే ఆచరణలోకి వస్తాయని చెప్పారు. నోవాక్ మాట్లాడుతూ రష్యా, ఇరాన్ మధ్య వాణిజ్య సహకారం మరింత పెరుగుతుందని ఆకాంక్షించారు. ద్వైపాక్షిక లావాదేవీల్లో తమ దేశాల కరెన్సీ వినియోగించుకునేలా చర్చలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దక్షిణాసియా నుంచి ఉత్తర ఐరోపా వరకు అంతర్జాతీయ రవాణా మార్గాన్ని పూర్తి చేసేందుకు ఇరాన్‌లో రైల్వేలైన్ నిర్మాణానికి ఒప్పందం కూడా రెండు దేశాల మధ్య జరిగినట్లు ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ప్రకటించింది. ఇరాన్, రష్యా దేశాలపై అమెరికా ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

శ్రీనివాస్‌కు తాత్కాలిక బెయిలిచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ: ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్‌కు సుప్రీంకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. తన మానసిక కుంగుబాటుకు కారణమయ్యారని ఆరోపిస్తూ శ్రీనివాస్‌పై అసోం యూత్ కాంగ్రెస్ మాజీ సభ్యులు అంకితా దత్తా కేసు పెట్టారు. అనంతరం ఆమెకు షోకాజ్ జారీ కావడం, యూత్ కాంగ్రెస్ నుంచి బహిష్కరించడం జరిగాయి. ఇదే కేసులో శ్రీనివాస్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను గువహటి హైకోర్టు ఈనెల5న తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ తాత్కాలిక బెయిల్ మంజూరైంది. జులై 10లోగా స్పందించాలనిఅసోం ప్రభుత్వానికి, ఇతరులకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. ఎఫ్ఐఆర్ నమోదులో నెలరోజుల జాప్యాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం... పిటిషనర్ తాత్కాలిక ఉపశమనానికి అర్హుడని, అరెస్టు పరిస్థితి వస్తే రూ.50వేల పూచీకత్తుపై ముందస్తు బెయిల్‌పై విడుదల చేయొచ్చు అని తెలిపింది. దర్యాప్తునకు సహకరించాలని శ్రీనివాస్‌కు సూచించింది. రాష్ట్ర పోలీసులు కోరినట్లుగానే ఈనెల 22న పోలీసుల ఎదుట హాజరుకావాలని, జాతీయ మహిళా కమిషన్ విచారణకూ సహకారం అందించాలని ఆయనకు కోర్టు సూచనలు చేసింది. తదుపరి విచారణను జులైకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

కిరణ్ రిజిజుకు స్థాన చలనం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడింది. న్యాయమూర్తుల నియామకంలో కొలీజియం సిఫార్సులను రిజిజు పదే పదే వ్యతిరేకించే వారు. న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించడం ఏమిటి అని ఆయన ప్రశ్నించడం వివాదాలు రేపింది. కొలీజియం సిఫార్సుల అమలులో జాప్యం జరగడంపై గత ఫిబ్రవరిలో కూడా సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. న్యాయ వ్యవస్థకు, పరిపాలనా విభాగానికి పొసగక పోవడం చాలా తీవ్రమైన విషయం అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ హెచ్చరికను ఖాతరు చేయకుండా రిజిజు పరిపాలన రాజ్యాంగం ప్రకారం జరుగుతుంది, ప్రజల అభీష్టం మేరకు జరుగుతుంది తప్ప కొందరు వ్యక్తుల ఇష్ట ప్రకారం జరగదని, ప్రజలకు మేలు కలుగుతుందో లేదో చూడాలని వ్యాఖ్యానించి వివాదాన్ని మరింత రెచ్చగొట్టారు.

బాధ్యతాయుత పదవుల్లో ఉన్న వారు ఆలోచించి మాట్లాడాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పై పరోక్ష విమర్శలు చేశారు. ఎవరూ ఎవరికీ హెచ్చరికలు చేయకూడదని కూడా ఆయన అన్నారు. కొలీజియం వ్యవస్థ మన రాజ్యాంగ పరిధిలో లేనిదని, దీనికి ప్రజల మద్దతు కూడా లేదని రిజుజు అన్నారు. 2014లో మోదీ ప్రభుత్వం జాతీయ న్యాయమూర్తుల నియామకాల కమిషన్ చట్టం తీసుకు వచ్చింది. ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు తోసి పుచ్చింది. ప్రధానమంత్రి సలహా మేరకు రిజుజు మంత్రిత్వ శాఖను మారుస్తున్నట్లు రాష్ట్రపతి నిలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పు జరగగానే రిజిజు తన ట్విట్టర్ ఖాతాలో మార్పులు చేశారు.

ప్రత్యక్ష ఆందోళన తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు ఉంటారని సీఎం వెళ్లిపోయి ప్రజల్ని ఉండమంటే వారు ఎలా ఉంటారని ప్రశ్నించారు. పేదవాళ్లు ఆత్మగౌరవంతో జీవించాలంటే ఒక సెంటు భూమి సరిపోదన్నారు. జగన్‌కు కడప, హైదరాబాద్, బెంగళూరు, తాడేపల్లిలో పెద్ద పెద్ద బంగ్లాలు ఉన్నాయని తెలిపారు. సెంటు స్థలం ఇస్తున్నట్లు గొప్పగా చెబుతున్నారేగానీ, ముఖ్యమంత్రి బంగ్లాలో ఉన్న బాత్‌రూం అంత స్థలం కూడా పేదలకు ఇవ్వడం లేదన్నారు. ఇందిరాగాంధీ హయాంలో పేదలకు 5 సెంట్ల స్థలం కేటాయించిందని గుర్తు చేశారు. పేదలకు ఇచ్చే సెంటు స్థలం కూడా హైకోర్టు తీర్పుకు లోబడి ఉంటుందని రాసి ఇస్తామని చెప్పటం విచిత్రంగా ఉందన్నారు. దేశంలో ఇలాంటి చర్యలు ఎప్పుడూ చూడలేదన్నారు. పేదవాళ్లను బిచ్చగాళ్లుగా చూడవద్దనీ, వాళ్లు కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజలేనని గుర్తించాలన్నారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే అమరావతి రాజధానిపై స్పష్టత ఇవ్వాలన్నారు. పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్లస్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఇల్లు నిర్మించుకోవటానికి ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇవ్వటంతో పాటు రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.1249 కోట్లు ఇస్తామని పేర్కొనటంపై ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. సీఎం ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థికమంత్రి, జలశక్తి మంత్రి, ప్రధానమంత్రులను కలిసి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటానికి నిధులు రాబట్టాలని కోరారు. సీఎం తన సొంత పనులపై ఢిల్లీ వెళుతున్నారే తప్ప ప్రజల కోసం కాదన్నారు. ఈ నేపథ్యంలో 22, 23 తేదీలలో విజయవాడలో జరుగనున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ, కార్యవర్గ సమావేశాలలో ఈ అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు రామకృష్ణ సమాధానం ఇస్తూ సెక్యులర్ పార్టీలతో కలిసి పని చేయటానికి సీపీఐ సిద్ధమేనని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలు, జనసేన, తెలుగుదేశం పార్టీలు కలిసి ముందుకెళితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తంచేశారు. దక్షిణాదిలో బీజేపీకి అవకాశాలు లేవన్నారు. గతంలో బీజేపీ పాచిపోయిన లడ్డూలు ఇచ్చిందని విమర్శించిన పవన్‌కల్యాణ్ ఇప్పుడు బీజేపీతో కలిసి వెళ్లటానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారో ఆయనే సమాధానం చెప్పాలన్నారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో ధర్నా చేశారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడుగడుగునా ద్రోహం చేసిందని, ఏపీలో ఓట్లడిగేందుకు బీజేపీకి సిగ్గుండాలని అన్నారు.

వివాదాలే కారణమా

నూదిల్లీ: కేంద్ర న్యాయమంత్రి కిరణ్‌రిజిజును వివాదాలు వెంటాడటంతో ఆయన తన పదవి నుంచి తప్పుకోవాల్సిన వచ్చింది. కొలీజియం వ్యవస్థ, న్యాయమూర్తుల నియామకాలు తదితర అంశాలపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యల క్రమంలో న్యాయశాఖ నుంచి రిజిజును కేంద్రం తప్పించింది. ఆయన స్థానంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రిగా అర్జున్ మేఘవాల్‌కు న్యాయశాఖ అదనపు బాధ్యతలను అప్పగించింది. రిజిజు ఇటీవల కొలీజియం వ్యవస్థపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా సుప్రీంకోర్టు, హైకోర్టుల జడ్జిల నియామకాలపై ఆయన చేసిన విమర్శలు వివాదాస్పదంగా మారాయి. కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధులను చేర్చాలని ఆయన నొక్కిచెప్పారు. దీంతో సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వానికి మధ్య అభిప్రాయభేదాలు తలెత్తాయి. రాజ్యాంగానికి 'ఏలియన్' అంటూ ఉన్నత న్యాయస్థానాన్ని విమర్శించిన రిజిజు... రిటైర్డ్ జడ్జిలను 'భారత్ వ్యతిరేక సంఘం' (యాంటీ ఇండియా గాంగ్) సభ్యులుగా వ్యాఖ్యానించారు.కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. న్యాయమూర్తుల నియామకాల్లో ప్రభుత్వ పాత్ర ఉండాల్సిందేనని చెప్పారు. ఇదే అంశమై సీజేఐ డీవై చంద్రచూడ్‌కు లేఖ కూడా రాశారు. 'స్వలింగ' వివాహాలపై సర్వోన్నత న్యాయస్థానం విచారించే క్రమంలో పెళ్లిళ్ల వ్యవహారాలను పార్లమెంటు నిర్ణయించాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు పార్లమెంటు ప్రాతినిధ్యం వహిస్తుందేగానీ కోర్టులు కాదని రిజిజు వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థలో అభిప్రాయ భేదాలను తోసిపుచ్చుతూ ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు మధ్య మహాభారతమేమీ జరగడం లేదన్నారు. కొలీజియంతోపాటు న్యాయవ్యవస్థపై కిరణ్ రిజిజు వ్యాఖ్యలను న్యాయవాద సంఘాలు తీవ్రంగా ఖండించాయి. విపక్షాలు కూడా మండిపడ్డాయి. బాంబే లాయర్స్ అసోసియేషన్... సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసింది. రాజ్యాంగ ఔన్నత్యానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించింది. కిరణ్ రిజిజును రాజ్యాంగబద్ధ పదవి నుంచి తప్పించాలని కోరింది. ఇలాంటి వ్యాఖ్యలపై విశాల దృక్పథంతో వ్యవహరిస్తామని చెప్పి ఆ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇలాంటి పరిణామాల క్రమంలో న్యాయశాఖ మంత్రిగా వివాదాలకు కేరాఫ్‌గా మారిన కిరణ్ రిజిజును ఆ శాఖ బాధ్యతల నుంచి కేంద్రం తప్పించింది. కాగా, కిరణ్ రిజిజు (51) అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన వారు. ఆయన ఆ రాష్ట్రం నుంచి మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. హన్స్‌రాజ్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేసిన ఆయన ఢిల్లీ యూనివర్సిటీలో న్యాయ విద్యను అభ్యసించారు. బీజేపీ హయాంలో అనేక బాధ్యతలను చేపట్టారు. మైనారిటీ, యువజన వ్యవహారాలు, క్రీడలు, హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2021, జులైలో కేంద్ర న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

రిజిజు...విఫల మంత్రి : కాంగ్రెస్

న్యాయశాఖ విఫల మంత్రి రిజిజు అంటూ తాజా పరిణామాల క్రమంలో కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. న్యాయశాఖ మంత్రిగా విఫలమైన రిజిజు ఇప్పుడు భూ విజ్ఞానశాస్త్ర శాఖ మంత్రిగా ఏం చేయగలరంటూ ఎంపీ మాణిక్యం ఠాగూర్ ఎద్దేవాచేశారు. ఎంపీ కపిల్ సిబల్ కూడా కిరణ్ రిజిజుపై వ్యంగ్యాస్త్రాలను సంధించారు.

స్పీడు పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

వేగవంతం చేసింది. ముఖ్యమంత్రి కూడా దీనిపై తాజాగా ఆదేశాలు జారీ చేశారు. పేదలకు ఎంత త్వరగా ఇళ్లు సమకూరిస్తే... వారి జీవితాలు అంతగా బాగుపడతాయని చెప్పారు. సీఆర్డీయే ప్రాంతంలో పట్టాల పంపిణీకీ అన్ని చర్యలు తీసుకున్నామని, భూమి చదును పనులు కూడా చేపట్టామని అధికారులు వివరించారు. సీఆర్డీయే ప్రాంతంలో ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమంతో పాటుగా నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా పంపిణీచేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేయాలని సీఎం ఆదేశించారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై కూడా సీఎం సమీక్షించారు. గడచిన 45 రోజుల్లో గృహ నిర్మాణానికి రూ.1085 కోట్లు ఖర్చు చేశామని, ఇప్పటివరకూ 3.70 లక్షల ఇళ్లు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. రూఫ్ లెవల్, ఆపైన నిర్మాణంలో ఉన్నవి మరో 5.01లక్షల ఇళ్లు ఉన్నట్లు వెల్లడించారు. బేస్‌మెంట్ స్థాయి దాటి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు 8.64లక్షలుపైనే ఉన్నాయని, వీటి పనులనూ వేగంగా ముందుకు తీసుకెళుతున్నామని అధికారులు వివరించారు. సీఎం ఆదేశాల మేరకు 'జగనన్నకు చెబుదాం' స్పెషల్ ఆఫీసర్లు కూడా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్నారని, ఇళ్ల నిర్మాణంలో వాడే మెటీరియల్ నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. ఇళ్ల లబ్ధిదారులైన మహిళలకు బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం కొనసాగుతుందని, ఇప్పటివరకూ 11.03 లక్షల మందికి రూ.35 వేల చొప్పున రుణాలు అందజేశామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, ఏపీఎస్‌హెచ్‌సీఎల్ చైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, గృహనిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, సీసీఎల్ఏ సెక్రటరీ ఏ ఎండీ ఇంతియాజ్, ఏపి టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ లక్ష్మీషా, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఎస్ఎస్‌సీ జేఈ, స్టెనో గ్రాఫర్ పరీక్షల తేదీల ఖరారు

ఢిల్లీ: దేశవ్యాప్తంగా వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల తేదీలను స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఖరారు చేసింది. జూనియర్ ఇంజినీర్ (సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్స్) పరీక్ష (పేపర్ 1) అక్టోబర్ 9, 10, 11 తేదీల్లోనీ స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సి అండ్ డి పరీక్షను అక్టోబర్ 12, 13 తేదీల్లోనీ జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్ అండ్ సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పరీక్షను అక్టోబర్ 16న నిర్వహించాలని నిర్ణయించినట్టు ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది.

రూపే నెట్‌వర్క్‌పై కొత్త క్రెడిట్ కార్డు

ముంబై: ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ పేటీఎం, ఎస్‌బీఐ కార్డ్, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ)కలిసి కొత్త క్రెడిట్ కార్డును విడుదల చేశాయి. ఎస్‌బీఐ-పేటీఎం కలిసి ఇది వరకే ఓ క్రెడిట్ కార్డును తీసుకొచ్చాయి. ఇప్పుడు ఎన్‌పీసీఐతో కలిసి రూపే నెట్‌వర్క్‌పై కొత్త క్రెడిట్ కార్డును తీసుకొచ్చారు.

ఈ క్రెడిట్ కార్డు ఉపయోగించి పేటీఎం ద్వారా చేసే చెల్లింపులపై 2% క్యాష్ బ్యాక్ లభిస్తుంది. ఇతర కొనుగోళ్లపై 1% క్యాష్ బ్యాక్ వస్తుంది. ఈ కార్డు ద్వారా ఇంధన కొనుగోళ్లపై 1% సర్‌చార్జి రద్దు ఉంటుంది. 'ప్లాటినమ్' కార్డుదారులకు రూ.లక్ష వరకు సైబర్ ఫ్రాడ్ కవరేజీ సదుపాయం ఉంటుంది. వెల్‌కమ్ బెనిఫిట్‌లో భాగంగా పేటీఎం ఫస్ట్ మెంబర్ షిప్ కింద రూ.75 వేల వరకు ప్రయోజనాలు పొందొచ్చని ఆయా సంస్థలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఇందులో భాగంగా ఓటీటీ మెంబర్‌షిప్‌తో పాటు, పేటీఎం యాప్ ద్వారా చేసే విమాన టికెట్లపై తగ్గింపు కూడా పొందొచ్చు. పేటీఎం యాప్ ద్వారా కొనుగోలే చేసే సినిమా, ప్రయాణ టికెట్లపై 3 శాతం క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. ఈ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో పేటీఎం వ్యవస్థాపకుడు, సీఈఓ విజయ్ శేఖర్ శర్మ మాట్లాడుతూ... రూపే క్రెడిట్ కార్డు నెట్‌వర్క్‌పై పనిచేసే ఈ క్రెడిట్ కార్డును క్యూఆర్ కోడ్ ద్వారా యూపీఐ చెల్లింపులకు వినియోగించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల డిజిటల్ పేమెంట్స్‌లో కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోందన్నారు. ఎస్‌బీఐ కార్డ్ ఎండీ సీఈఓ రామమోహన్ రావు, ఎన్‌పీసీఐ సీఈఓ ప్రవీణా రాయ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిద్ధూకే పీఠం

(మొదటిపేజీ తరువాయి)

నమ్ముతుందిగానీ నిరంకుశత్వాన్ని కాదన్నారు. ఇద్దరు నేతలు సమర్థ పాలనను అందిస్తారని చెప్పారు. పార్టీ సీనియర్ నేత రణదీప్ సూర్జేవాలా మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఇచ్చిన ఐదు హామీల అమలునకు కేబినెట్ తొలి సమావేశంలో చర్యలు ఉంటాయని అన్నారు. తాజా ఎన్నికలు పేదలకు, ధనికులకు మధ్య జరిగాయని, కాంగ్రెస్‌కు ఘనవిజయాన్ని కట్టబెట్టిన కర్నాటక ప్రజలు కృతజ్ఞులమన్నారు. సిద్ధ, డీకే శివ సమర్థ నాయకలని, ముఖ్యమంత్రి కావాలని వారు కోరుకోవడం న్యాయమేనని చెప్పారు. ఇద్దరిని డైనమిక్ నాయకులంటూ కొనియాడారు. సమర్థ, పారదర్శక, సుస్థిర పాలనను అందించగలరన్నారు. ఇదిలావుంటే, 'కర్నాటక పటిష్ఠ భవిష్యత్, ప్రజా సంక్షేమమే మాకు ప్రాధాన్యం, ఇందుకు కలిసి పనిచేస్తాం' అని శివకుమార్ ట్వీట్ చేశారు. కర్నాటక ప్రజలకు పురోగతి, సంక్షేమం, సామాజిక న్యాయాన్ని అందించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉన్నదని మల్లికార్జున ఖర్గే కూడా ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

బాధలేదు: డీకే

కర్నాటక ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడంపై తనకు బాధ లేదని డీకే శివకుమార్ అన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని అంగీకరిస్తున్నట్లు చెప్పారు. కలిసి పనిచేద్దాం అని రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే చెప్పారని, కర్నాటక ప్రజల అభివృద్ధి కోసం సీఎం సిద్దరామయ్యతో కలిసి పనిచేస్తానని చెప్పారు. 'సీఎం ఎంపిక విషయంలో పార్టీ అధిష్ఠాన నిర్ణయం తుదితీర్పు లాంటిది. కోర్టులో తీర్పు తరహాలోనే అధిష్ఠానం నిర్ణయాన్ని అంగీకరిస్తున్నా. కర్నాటకలో కాంగ్రెస్ గెలవకపోయివుంటే ఎలాంటి పరిస్థితి ఉండేది? కానీ గెలిచింది కాబట్టి దాని ఫలాలను అందుకోవాలి. ఇది నా ఒక్కడి విజయం కాదు. లక్షలాది మంది కార్యకర్తల శ్రమ. ప్రజలు ఇంతటి భారీ విజయాన్ని అందించినప్పుడు ఆనందపడాలి. ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఇదే ప్రధాన అజెండా' అని శివకుమార్ తెలిపారు.

జీఓ111 రద్దు

వీఆర్ఏల రెగ్యులరైజ్

33 జిల్లాలకు డీఎంహెచ్ఓ పోస్టులు

తెలంగాణ కేబినెట్ నిర్ణయాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: జీఓ నం.111 పూర్తిగా ఎత్తివేయాలని తెలంగాణ మంత్రివర్గం నిర్ణయించింది. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, మల్లారెడ్డి మీడియాకు వెల్లడించారు. జీఓ నం.111 రద్దు కోసం చాలా కాలంగా 84 గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారని, వారికి ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. హెచ్ఎండిఏ భూముల మాదిరిగానే ఈ గ్రామాలకు కూడా అవే నిబంధనలు వర్తిస్తాయని వారు తెలిపారు. హిమాయత్ సాగర్, గండిపేట జలాశయాల్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీటితో పాటు మూసీని కాళేశ్వరం జలాలతో అనుసంధానించాలని నిర్ణయించినట్లు తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 21 రోజుల పాటు అన్ని నియోజకవర్గాల్లో సంబురాలు జరపాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. కులవృత్తుల అభివృద్ధి కోసం మంత్రి గంగుల ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ వేయాలని నిర్ణయం తీసుకుని విధివిధానాలు రూపొందించే బాధ్యత అప్పగించడం జరిగిందన్నారు. హైదరాబాద్ పట్టణ జనాభాకు మరింతగా వైద్య సేవలు అందేలా జీహెచ్ఎంసీ 6 జోన్లకు అనుగుణంగా 6 డిఎంహెచ్ ఓలను నియమిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 38 డీఎంహెచ్‌ఓలు పని చేస్తారని, 40 మండలాల్లో కొత్త పీహెచ్‌సీలను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్బన్ పీహెచ్‌సీలలో ఇప్పటి వరకు కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఇప్పుడు పర్మినెంట్‌గా ఉద్యోగులను తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నామని వివరించారు. రైతు బిడ్డ సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగంలో మార్పుల కోసం వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి అధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ వేయడం జరుగుతుందన్నారు. నాడు 10 జిల్లాల్లో 9జిల్లాలు వెనుకబడ్డ జిల్లాలే కానీ నేడు దేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిందంటే, దానికి సీఎం కేసీఆర్ నిర్ణయాలే కారణమన్నారు.

మమతను కదిలించిన నితీశ్ మంత్రం

జేడీయూ నేత కేసీ త్యాగి

న్యూఢిల్లీ: నితీశ్ కుమార్‌తో సమావేశం తర్వాతే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికిందని జనతా దళ్ యునైటెడ్ (జేడీ-యూ) పార్టీ సీనియర్ నాయకుడు కేసీ త్యాగి అన్నారు. మమతా బెనర్జీకి 'వన్ ఆన్ వన్' ప్రణాళిక అందించింది నితీశ్ కుమార్ అని, ఆ తర్వాత దానిని ఆమె సమర్థించారని ఆయన ఒక ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ చెప్పారు. బలమైన ప్రాంతీయ పార్టీలు తమ సొంత గడ్డపై బీజేపీని ఎదుర్కోవడానికి ఒంటరిగా ఉండాలని, ప్రత్యక్ష పోటీలో ఉన్న రెండు జాతీయ పార్టీలు 200 స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తారని ఆయన వివరించారు. 'మమతా బెనర్జీ 2024 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ యేతర తృతీయఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశాన్ని విరమించుకున్నారు. నితీశ్‌తో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని ఆమె చెప్పారు. మమతా బెనర్జీ నితీశ్‌ను కలిసినప్పుడు, ఒక ఐక్య ప్రతిపక్ష కూటమి ఏర్పాటు గురించి ఆమె సానుకూలంగా కనిపించారు' అని త్యాగి వివరించారు. 'అంతకుముందు, ఆమె అభిప్రాయం వేరు. కాంగ్రెస్ యేతర తృతీయ ఫ్రంట్‌ను ఆమె కోరుకున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు 'ఒకరిపై ఒకరు' అభ్యర్థులను నిలబెట్టాలన్న నితీశ్ కుమార్ సూత్రాన్ని ఇప్పుడు ఆమె అంగీకరిస్తున్నారు' అని అన్నారు. 'పాట్నాలో విపక్ష నేతల సమావేశం ఏర్పాటు చేయాలని మమతా బెనర్జీ అన్నారు. జేపీ (జయప్రకాష్ నారాయణ్) ఉద్యమం ప్రారంభమైనప్పుడు బీహార్ కేంద్రంలో మార్పునకు చిహ్నం. కేసీఆర్, అరవింద్ కేజ్రీవాల్‌కు సంబంధించి కాంగ్రెసేతర తృతీయ ఫ్రంట్ ఏర్పాటు చేయాలనే మమతా బెనర్జీ ఆలోచన మారింది' అని తెలిపారు. నితీశ్ కుమార్ విపక్ష ఐక్య సూత్రం... ఇందులో బీజేపీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఒక అభ్యర్థిని నిలబెట్టాలని మేము ప్రతిపాదించాము. ఇప్పుడు ఎక్కువ మంది అంగీకరించారు' అని జేడీ-యూ నాయకుడు అన్నారు. కర్నాటకలో బీజేపీపై కాంగ్రెస్ నిర్ణయాత్మక విజయం సాధించిన కొన్ని రోజుల తర్వాత, మమతా బెనర్జీ 2024 ఎన్నికల్లో ఒంటరిగా వెళ్లే తన ప్రణాళికలను విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. విభేదాలను పరిష్కరించడానికి ప్రతిపక్ష పార్టీలకు పని పరిష్కారాన్ని ప్రతిపాదించారు. ఒక బలమైన కూటమిని ఏర్పాటు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా 2024 ఎన్నికల కోసం బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపాదిత కూటమిలో కాంగ్రెస్ ప్రధాన పాత్ర పోషిస్తుందనే ఆలోచనను వ్యతిరేకించిన ప్రతిపక్ష నాయకులలో తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కూడా ఉన్నారు. 'ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న చోట బీజేపీ పోరాడదు. కర్నాటక తీర్పు బీజేపీకి వ్యతిరేకంగా తీర్పు. ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. దౌర్జన్యాలు జరుగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ నాశనమైంది. ప్రజాస్వామ్య హక్కులు పెకలించబడుతున్నాయి' అని బెనర్జీ అన్నారు. 'ఎక్కడైనా బలంగా ఉన్న వారి ప్రాంతంలో వారు కలిసి పోరాడాలి. బెంగాల్‌ను తీసుకుందాం. బెంగాల్‌లో మనం (తృణమూల్) పోరాడాలి. ఢిల్లీలో ఆప్ పోరాడాలి. బీహార్‌లో నితీశ్ జీ (నితీశ్ కుమార్), తేజస్వి (యాదవ్), కాంగ్రెస్ కలిసి ఉన్నాయి. వారు నిర్ణయిస్తారు. వారి ఫార్ములాపై నేను నిర్ణయం తీసుకోలేను. చెన్నైలో ఎం.కె.స్టాలిన్, కాంగ్రెస్‌కు స్నేహం ఉంది. వారు కలిసి పోరాడగలరు. జార్ఖండ్‌లో కూడా వారు (జేఎంఎం-కాంగ్రెస్) కలిసి, ఇతర రాష్ట్రాల్లో కూడా. అందువల్ల అది వారి ఎంపిక' అని బెనర్జీ చెప్పారు. 'బలమైన పార్టీకే ప్రాధాన్యత ఇవ్వాలి. మరి కాంగ్రెస్‌కు 200 సీట్లలో లేదా ఇంకేదైనా బలం ఉన్న చోట, మేము ఏమి లెక్కించాము. దాని ప్రకారం, వారిని పోరాడనివ్వండి. మేము వారికి మద్దతు ఇస్తాము. ఇది అందరికీ. మీకు ఏదైనా మంచి విషయం కావాలంటే, అప్పుడు మీరు కొన్ని ప్రాంతాలలో మిమ్మల్ని మీరు త్యాగం చేసుకోవాలి' అని మమతా బెనర్జీ అన్నారు.

రాజస్థాన్ కాంగ్రెస్‌లో బాహాబాహి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని పిలుపు ఇవ్వడమే కాకుండా రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఆర్‌పీఎస్‌సీ)తో పాటు పేపర్ లీక్‌లతో ప్రభుత్వ నియామక పరీక్ష రద్దుతో ప్రభావితమైన వారికి పరిహారం వంటి అంశాలపై పైలెట్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. తన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనను చేపడతానని కూడా ఇటీవల పైలెట్ హెచ్చరికలు చేశారు.

జల్లికట్టుకు జంతుహింస చట్టం వర్తించదు

(మొదటిపేజీ తరువాయి)

2017లో తమిళనాడు ప్రభుత్వం జల్లికట్టుకు అనుకూలంగా ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాల్టీ టు యానిమల్స్ చట్టానికి సవరణలు చేస్తూ కొత్త యాక్ట్ తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. 1960 నాటి జంతు హింస నివారణ చట్టాన్ని ఉల్లంఘించేలా ఈ చట్టం ఉందని పిటిషనర్లు పేర్కొన్నారు. దీని వల్ల జంతువులు, మనుషులు గాయాలపాలయ్యే ప్రమాదం ఉందని, హింసతో కూడిన ఈ ఆటను నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై గతేడాది విచారణ జరిపిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం జల్లికట్టులో హింస ఉంటుందని, అంత మాత్రానా దాన్ని నెత్తుటి క్రీడ అనలేమని పేర్కొంది. అనంతరం తీర్పును రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు గురువారం తీర్పు వెలువరించింది.

ఆర్-5 జోన్ పేరుతో

రైతులు, పేదల మధ్య గొడవలకు జగన్ కుట్ర

పార్టీ వ్యూహ కమిటీ నేతల సమావేశంలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేదల్ని మోసగించే ప్రక్రియలో భాగంగానే వైసీపీ ప్రభుత్వం ఆర్-5 జోన్ ఏర్పాటు చేసి రైతులు, పేదలకు మధ్య గొడవ పెట్టే కుట్రకు తెరలేపిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. పార్టీ వ్యూహ కమిటీ నేతలతో గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడారు. ఆర్ 5జోన్ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు, రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ కోతలు, వివేకా హత్య కేసు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సీఆర్డీఏ బృహత్ ప్రణాళికలోనే 5 శాతం భూమిని పేదల గృహ నిర్మాణానికి రిజర్వ్ చేయడంతో పాటు 5వేల టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని టీడీపీ ప్రభుత్వం 90 శాతం పూర్తిచేసిందని చంద్రబాబు గుర్తు చేశారు. ఆర్-5 జోన్ పేరుతో పేదల్ని వంచించటమే కాకుండా రైతులకు అన్యాయం చేస్తూ రెండు వర్గాల ప్రయోజనాలు దెబ్బతీసేలా వైసీపీ కుట్ర పన్నిందని ఆయన మండిపడ్డారు. రెండు పక్షాలకూ ప్రయోజనం చేకూరేలా టీడీపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తే రెండు వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా వైసీపీ కుట్రలు పన్నుతోందని దుయ్యబట్టారు. వివేకా హత్య కేసు వాదించే న్యాయవాదులకే ప్రభుత్వ సంబంధిత కేసులు అప్పగించటం వెనుక ఆంతర్యమేమిటని చంద్రబాబు నిలదీశారు. వివేకా హత్య కేసు నిందితుల తరఫున వాదించే న్యాయవాదులకు ప్రభుత్వ కేసులు అప్పగిస్తూ వారికి ప్రజాధనం దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్-5 జోన్ వ్యవహారంలోనూ పేదల్ని వంచిస్తూ అధిక మొత్తంలో ప్రజా ధనాన్ని ఫీజుల రూపంలో న్యాయవాదులకు చెల్లిస్తున్నారని నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వేసవిలో విద్యుత్ వినియోగంపై ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవటంతోనే రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ అంశాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రభుత్వ దమననీతిని ఎక్కడికక్కడ ఎండగట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

చంద్రబాబుకు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతల వినతి

విశాలాంధ్ర-విశాఖ: రాష్ట్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని టీడీపీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత నారా చంద్రబాబు నాయుడుకి ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు గురువారం పెందుర్తిలో వినతి పత్రం అందజేశారు. ఏటా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రభుత్వం ఆచరణలో చేతులెత్తేసిందని, పరిశ్రమల స్థాపన జరగకపోవడంతో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. మెగా డిఎస్సీ, విశ్వ విద్యాలయాల టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ, పీహెచ్‌డీ,ఎంఫిల్ స్కాలర్‌షిప్ తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ అచ్యుత్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కిరణ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

నేడే 'వలంటీర్లకు వందనం'

సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డుల ప్రదానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సచివాలయ వలంటీర్లను సత్కరించనుంది. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా అత్యుత్తమంగా పనితీరు కనబర్చిన వారికి పురస్కారాలు ఇవ్వనున్నారు. అవినీతికి తావులేకపోవడం, సచ్ఛీలత, ఇంటింటి సర్వే, పెన్షన్ల పంపిణీ, హాజరు, యాప్‌ల వినియోగం, నవరత్నాల అమల్లో భాగస్వామ్యం, రేషన్ డోర్ డెలివరీ, పెన్షన్ కార్డు, రైస్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డుల్ని మంజూరు చేయించడం తదితర అంశాల్లో పనితీరు ప్రామాణికంగా అవార్డులకు ఎంపిక చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2,33,719 మందికి రూ. 243.34 కోట్ల నగదు పురస్కారాలు ఇవ్వనున్నారు. మే 19 వ తేదీ నుండి అన్ని నియోజకవర్గాల్లో పండగ వాతావరణంలో వలంటీర్లకు అవార్డుల ప్రదానం మొదలవుతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విజయవాడలో ఈకార్యక్రమాన్ని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభిస్తారు. కనీసం సంవత్సర కాలంగా నిరంతరాయంగా సేవలందిస్తున్న వలంటీర్లకు, వారు అందించిన సేవల ఆధారంగా మూడు కేటగిరీల్లో పురస్కారాలు అందజేస్తారు.

సేవా వజ్ర

సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.30 వేల నగదు బహుమతి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన మొదటి ఐదుగురు వలంటీర్లకు 175 నియోజకవర్గాల్లో 875 మంది వలంటీర్లకు సేవా వజ్ర పురస్కారాలు ప్రదానం చేస్తారు.

సేవా రత్న

సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.20 వేల నగదు బహుమతి. ప్రతి మండలం, మున్సిపాలిటీ పరిధిలో ఐదుగురు చొప్పున, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 10 మంది చొప్పున టాప్ 1 ర్యాంకు సాధించిన వలంటీర్లకు, మొత్తంగా 4,220 మందికి సేవా రత్న పురస్కారాల ప్రదానం.

సేవా మిత్ర

సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ. 10వేల నగదు బహుమతి. రాష్ట్రవ్యాప్తంగా ఏడాది పాటు ఎటువంటి ఫిర్యాదులు, వివాదాలు లేకుండా పనిచేసిన వలంటీర్లకు 2,28,624 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేస్తారు.

శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి వేదికపై నరసింహారెడ్డి, రామాంజనేయులు

యుద్ధాలపై అగ్ర రాజ్యాల వ్యాపారం

రమేశ్ పట్నాయక్ ఆందోళన

విశాలాంధ్ర- విజయవాడ(చిట్టినగర్): యుద్ధాలతో అగ్ర రాజ్యాలు వ్యాపారాలు చేస్తూ దోపిడీ చేస్తున్నాయని ఏపీ విద్యా సమితి ప్రతినిధి రమేష్ పట్నాయక్ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర విద్యా విభాగం ఆధ్వర్యంలో విజయవాడలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో 'మార్క్సిస్టు రాజకీయ అర్థ శాస్త్రం పై రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు గురువారం రెండో రోజు నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ నుంచి 21వరకు జరుగుతున్న ఈ శిబిరంలో గురువారం 'నయా ఉదారవాదం, మతం, మార్కెట్' అంశంపై రమేష్ పట్నాయక్, 'పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదం' అనే అంశంపై ఆచార్య డి.నరసింహారెడ్డి, 'భారత సామాజిక నిర్మాణం... కులం, వర్గం, పొందిక'అంశంపై ఆచార్య కె.శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో కులం పునాదులు పై ఓట్లు రాజకీయాలు స్వాతంత్ర్యం అనంతరం విచ్చలవడిగా పెరిగి పోయాయని అన్నారు. భారత సమాజంలో కులం పునాదులు బలంగా పాతుకు పోయాయని, ఆ చక్రం నుంచి బయటపడాలని సూచించారు. తొలుత సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

మానసిక నిపుణుల సేవలు ఎంతో అవసరం

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు, యువతను చెడు మార్గాల నుంచి మళ్లించి వారి భవిష్యత్తును చక్కదిద్దేందుకు మానసిక వైద్యులు ముందుకు రావాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన 'తెలుగు సినిమాలలో మనసు పాటలు-విశ్లేషణ' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం యువతలో డ్రగ్స్, మద్యపానం, క్రికెట్ బెట్టింగ్, అపరిపక్వ ప్రేమ వ్యవహారాలు, ఆత్మహత్యలు, గతం కంటే చాలా అధికంగా జరుగుతుండటం చాలా బాధాకరం అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తరుపున మంచి విద్యతో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి, లైఫ్ స్కిల్స్ శిక్షణకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు మన రాష్ట్రంలో సైకియాట్రిస్టులు కూడా తమవంతుగా ముందుకు వస్తే వారితో కలిసి యువతకు సంబంధించి కొన్ని మంచి శిక్షణా కార్యక్రమాలు చేపడతామన్నారు. దీనికి సైకియాట్రిస్టుల సహకారం కావాలన్నారు.

ముఖ్యవక్తగా పాల్గొన్న డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తెలుగు సినిమాలలో వచ్చిన మనసు పాటల గురించి వాటిలోని నేపథ్యం, వాటిలోని అంతరార్థం గురించి ఆడియో విజువల్ ద్వారా మానసిక విశ్లేషణ చేశారు. ఆత్రేయ, శ్రీశ్రీ, సరివెన్నెల లాంటి సినీ గేయ రచయితలు, రాసినెన్నో పాటలను ఆయన ఈ సందర్భంగా సభికులకు సోదాహరణంగా వివరించారు.

మరో అతిథి డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఇండ్ల రామసుబ్బారెడ్డిని అభినందించారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, డాక్టర్ సమరం, విజయవాడ చాప్టర్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నవీన, డాక్టర్ పవన్, డాక్టర్ విశాల్, డాక్టర్ విజయలక్ష్మితో మానసిక వైద్య శాస్త్రంలో పీజీ విద్యార్థులు, యువ డాక్టర్లు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం డిమాండ్
- 25న కలెక్టరేట్లకు వినతులు

విశాలాంధ్ర-విజయవాడ: కౌలురైతులకు గుర్తింపు కార్డులను వెంటనే జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటా ఏప్రిల్ మొదటి వారంలో గుర్తింపు కార్డులు ఇవ్వడానికి నోటిఫికేషన్ జారీ చేస్తారు. కానీ ఇంతవరకు అది జరగలేదు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం తగదు. గుర్తింపు కార్డులు ఇవ్వకపోతే రైతుభరోసా కేంద్రాల నుంచి విత్తనాలు, ఎరువులను రైతులు ఎలా పొందగలరు? పెట్టబడి సాయం (సీఎం కిసాన్)వంటివి వారికి దూరమవుతాయి. వెంటనే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీకి నోటిఫికేషన్ ఇవ్వాలి' అని నేతలు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 25వ తేదీన కౌలురైతుల సమస్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు.

ఓల్డ్‌డేటా ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

వెంకటసుబ్బయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్టర్ కార్యాలయాల్లో ఓల్డ్‌డేటా ఆపరేటర్ల (కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల) పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో గురువారం జరిగిన ఓల్డ్ డేటా ఆపరేటర్ల ధర్నాకు హాజరైన ఆయన మాట్లాడుతూ ఓల్డ్‌డేటా స్కానింగ్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని, వీరిలో సుమారు 1600 మంది ఒప్పంద కార్మికులు ఉన్నారని అన్నారు. ఒప్పంద కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలివ్వకుండా కాంట్రాక్టర్లు మోసం చేస్తున్నారన్నారు. 'జావా మెటిక్ మేవరిక్ రైటర్స్ బిజినెస్ సొల్యూషన్' కంపెనీ ఉద్యోగులుగా చేరాలంటే ఒక్కొక్కరు రూ.లక్ష/రూ.2లక్షలు లంచాలు ఇచ్చారని చెప్పారు. ఆప్కాస్‌లో చేరుస్తామని మాయమాటలు చెప్పి వీరి నుంచి సొమ్ము దండుకున్నారని ఆరోపించారు. ఉద్యోగులను మోసం చేసిన కంపెనీ వారిపై కేసు పెట్టాలని, అరెస్టు చేయాలని వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ ఓల్డ్‌డేటా ఆపరేటర్ల సమస్యలు న్యాయబద్ధమైనవన్నారు. విశాఖపట్నంలో ఇలాగే ఉద్యోగులు మోసపోయారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీరి సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కంకిపాడు డీఐజీకి వినతిపత్రాన్ని నాయకులు అందజేశారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి కేఆర్‌ఆంజనేయులు, రాష్ట్ర సమితి సభ్యులు కొట్టు రమణ, కార్మికులు ఈశ్వరి, శివాజీ, వెంకటేసు, శివ, నిర్మల, కృష్ణారావు పాల్గొన్నారు.

రాయలసీమలో వ్యవసాయ పరిశోధక కేంద్రాలు

నారా లోకేశ్ హామీ

విశాలాంధ్ర-నంద్యాల: రాయలసీమ రైతులకు నీరందిస్తే బంగారం పండిస్తారని, రాయలసీమలో వ్యవసాయ పరిశోధక కేంద్రాలను ఏర్పాటు చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. నంద్యాల పట్టణ శివారు యాతం గార్డెన్స్‌లో గురువారం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనేకమంది రైతులు వారి సమస్యలను ఏకరువు పెట్టారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం కోసం టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అన్ని వ్యవస్థలను వైసీపీ నాశనం చేసిందని విమర్శించారు. టీడీపీ హయాంలో వ్యవసాయ పెట్టుబడి తగ్గించాలన్న ఉద్దేశంతోనే జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్‌ని ప్రోత్సహించామన్నారు. మరల టీడీపీ అధికారంలోకి వస్తే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల రేట్లు తగ్గించి వ్యవసాయ అనుబంధ రంగాలను కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామన్నారు. మంత్రి బుగ్గన నియోజకవర్గంలో రైతు రవికి అన్యాయం జరిగితే కనీసం స్పందించలేదని, బుగ్గన అనుచరులే రైతులపై దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. రవికి టీడీపీ అండగా ఉంటుందని లోకేశ్ హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.11,700కోట్లు ఖర్చు చేశామని, వైసీపీ హయాంలో కనీసం టీడీపీ చేసిన వ్యయంలో 10శాతం కూడా ఖర్చు కూడా చెయ్యలేదని విమర్శించారు. వరి, పత్తి, వేరుశనగ, జొన్న, మిరప, పసుపు, మినుము సాగుచేసే రైతుల కష్టాలన్నీ తెలుసుకున్నట్లు తెలిపారు. కోల్డ్ స్టోరేజీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చెయ్యడంతో పాటు పంట అమ్ముకోవడం కోసం మార్కెట్లు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, మాజీమంత్రి ఎన్ఎండి ఫరూక్, టీడీపీ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ మౌలానా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్‌తో పాటు రైతులు, టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లోకేశ్‌కు ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతల వినతి

విశాలాంధ్ర- నంద్యాల: విద్యారంగ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడాలని కోరుతూ నంద్యాలలో యువగళం పాదయాత్రలో ఉన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర, ఉపాధ్యక్షుడు నాగ రాముడు, సహాయ కార్యదర్శి కారమంచి, ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు, జిల్లా సహాయ కార్యదర్శి రవి తదితరులు వినతిపత్రం అందజేశారు.

పేదల సొంతింటి కల నెరవేరింది: మంత్రి తలసాని

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల ద్వారా పేద ప్రజల సొంతింటి కల నెరవేరిందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం కమలానగర్ ఎస్పిఆర్ హిల్స్‌లో రూ. 1785 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన 210 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ సముదాయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీలు సురభీవాణిదేవి, మిర్జా రహమత్ బేగ్, రహమత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు సబ్సిడీ ద్వారా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకున్న బకాయిలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేసిందని తెలిపారు.

రేపు పాలీసెట్ ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పాలిటెక్నిక్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పాలీసెట్ - 2023) ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పరీక్షా ఫలితాలను విడుదల జరుగుతుంద న్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి ఛైర్మన్ చదలవాడ నాగరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10న పాలీసెట్ పరీక్షలు జరిగాయి. సాంకేతిక విద్య, శిక్షణా మండలి 2023-24 విద్యా సంవత్సరానికి సంభందించి ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సులలో ప్రవేశానికి పాలిసెట్ - 2023 పరీక్ష నిర్వహించగా 1,43,625 మంది హాజరయ్యారు. పాలిటెక్నిక్ ప్రవేశానికి సంబంధించిన వెబ్ కౌన్సెలింగ్ వివరాలను అదే రోజు ప్రకటిస్తామని, ఫలితాలు విడుదలయ్యాక... ఫలితాలు, ర్యాంకుల వివరాలను పాలీసెట్‌ఏపీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని నాగరాణి వెల్లడించారు.

మత్తు ఇంజక్షన్లను విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖలో అనధికారకంగా మత్తు ఇంజక్షన్లను సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎనస్తీయా మత్తు ఇంజక్షన్లు, గంజాయితోపాటు స్మార్ట్‌ఫోన్ రికవరీ యాప్ ద్వారా 100 స్మార్ట్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గత కొన్ని రోజులుగా నగరంలో పెంటజోన్‌లేక్ టోల్ 7వేల శాంపిల్ ఇంజక్షన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుండి తీసుకువచ్చి విశాఖ నగరంలో అమ్ముతున్న ఉమా మహేష్, వెంకటేశ్ లను అదుపులోకి తీసుకుని విచారించగా రూ.30లకు కొన్న ఇంజక్షన్లు రూ.300 లకు అమ్ముతూ యువతను మత్తులో తప్పుదారి పట్టిస్తున్న ముఠా గుట్టురట్టయిందని తెలిపారు. ఈ ఇంజక్షన్లు డాక్టర్ సిఫార్సు లేకుండా బయట అమ్మకం జరగదని, వీరు అక్రమంగా విక్రయించడం, సరఫరా చేయడం చేస్తున్నారన్నారు. ఈ కేసులో మరి కొంతమందిని అరెస్ట్ చేయాల్సి ఉందని సీపీ తెలిపారు. అలాగే అల్లిపురంలో స్మార్ట్ ఫోన్ రికవరీ యాప్ ద్వారా దాదాపు 20 లక్షలు విలువ గల స్మార్ట్ ఫోన్లను ఈ ముఠా నుండి స్వాధీనం చేసుకున్నామని సీపీ వివరించారు.

మరో భారీ పెట్టుబడి

హైదరాబాద్‌లో 3వేల కోట్లతో 'మెడ్‌ట్రానిక్' విస్తరణ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో మరో అంతర్జాతీయ సంస్థ భారీ పెట్టుబడి పెట్టనుంది. వైద్య పరికరాల ఉత్పత్తి, ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెడ్‌ట్రానిక్స్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. మూడు వేల కోట్ల రూపాయలతో హైదరాబాద్‌లో మెడికల్ డివైజెస్ ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నది. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావుతో ఆ కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. తమ విస్తరణ ప్రణాళికల గురించి వివరించారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగంలో హైదరాబాద్‌ను గ్లోబల్ లీడర్‌గా మార్చే తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నంలో భాగస్వాములం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మెడ్‌ట్రానిక్ సర్జికల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మైక్ మరీనా మాట్లాడుతూ... మానవ జీవితాలను మార్చే టెక్నాలజీ ఆవిష్కరణలకు భారతదేశం సరికొత్త గమ్యస్థానంగా మారిందన్నారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగం లో హైదరాబాద్ ప్రాధాన్యతను గుర్తించినంతనే తాము ఈ పెట్టుబడి ప్రకటన చేస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందని మరీనా చెప్పారు. మెడ్‌ట్రానిక్స్ వైస్ ప్రెసిడెంట్ దివ్య ప్రకాష్ జోషి మాట్లాడుతూ... హెల్త్‌కేర్ టెక్నాలజీలో ఆవిష్కరణలు, పురోగతికి ఆర్ అండ్ డిలో తాము పెడుతున్న పెట్టుబడి పునాది అవుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. వైద్య పరికరాల ఉత్పత్తికి భారత్‌లో అపారమైన మార్కెట్ ఉందని గుర్తించిన తొలి రాష్ట్రం తెలంగాణ అని మంత్రి కేటీఆర్ అన్నారు. లైఫ్ సైన్సెస్,హెల్త్ కేర్ రంగంలో హైదరాబాద్ కు ఉన్న పట్టుకు, పెరుగుతున్న ప్రాధాన్యతకు మెడ్‌ట్రానిక్ తాజా పెట్టుబడే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో హెల్త్‌కేర్ టెక్నాలజీ రంగం వృద్ధికి తోడ్పాటు అందించడంతో పాటు మెడ్‌ట్రానిక్స్ విస్తరణ ప్రణాళికలకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. పరిశ్రమలు, వాణిజ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, తెలంగాణ ప్రభుత్వ లైఫ్ సైన్సెస్ సీఈఓ శక్తి ఎం.నాగప్పన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సీపెట్ డిప్లొమాకు దరఖాస్తుల ఆహ్వానం

జూన్ 11న ఆన్‌లైన్‌లో ప్రవేశపరీక్ష

విశాలాంధ్ర-విజయవాడ: భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానించారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఐఈటీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించినట్లు సంస్థ సంయుక్త డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల డిప్లొమా ఇన్‌ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్‌ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులకు 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులుగా పేర్కొన్నారు. రెండేళ్ల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్‌ప్లాస్టిక్ అండ్ టెస్టింగ్ కోర్సుకు బీఎస్సీ ఉత్తీర్ణులైన వారు, తుది సంవత్సరం విద్యార్థులు అర్హులుగా వెల్లడించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓబీసీ, జనరల్ కేటగిరి విద్యార్థులు రూ.500 చొప్పున రుసుము ఆన్‌లైన్‌లో చెల్లించి ఈనెల 28వ తేదిలోగా నమోదు చేసుకోవాలన్నారు. జూన్11న విజయవాడ, అనంతపురం కేంద్రాలలో ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష జరుగుతుందని తెలిపారు. ఏపీ ప్రభుత్వం జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9441406543 ఫోన్‌నంబరును సంప్రదించాలని విద్యార్థులకు శేఖర్ సూచించారు.

పిడుగుపాటుకు 17 మేకల మృతి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పిడుగుపాటుకు 17మేకలు మృతి చెందాయి. ఈ ఘటన విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం బొడ్డవర పంచాయతీ శివారు మరుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పిడుగు పాటుకు మేకలు చనిపోవడంతో వీటిని సాకుతున్న దేపరి సత్తిబాబు అనే రైతుకు రూ.2లక్షల నష్టం వాటిల్లింది. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురుగాలులతో వర్షం ప్రారంభమవడంతో సత్తిబాబు కల్లంలో ఉన్న 30 మేకలకు గాను కొన్ని అక్కడే ఉన్న చెట్టు కిందకు వెళ్లాయి. ఇదే సమయంలో పెద్ద శబ్దంతో చెట్టుపై పిడుగు పడటంతో కింద ఉన్న 17 మేకలు విద్యుదాఘాతానికి గురై కొయ్యబారిపోయాయి. స్థానికంగా సచివాలయంలో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ వచ్చి మేకలు మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా రైతు సత్తిబాబు నిర్మాణంలో ఉన్న ఇంటి స్లాబు పని చూసుకుని కల్లం వద్దకు వెళ్లే సరికి అప్పటికే పిడుగు ఘటన జరిగింది. విషయం తెలిసిన వెంటనే బాధిత రైతు సత్తిబాబుని గ్రామ సర్పంచ్ మీనా, వైఎస్సార్సీపీ నాయకులు బీ మురళి రాజు, డీ సన్యాసిదేముడు, ఉప సర్పంచ్ అడారి అప్పారావు, టీడీపీ నేత శ్రీనురాజు తదితరులు పరామర్శించారు. జరిగిన ఘటనను తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసి నష్ట పరిహారం అందేలా చూస్తామని తెలిపారు.

సంపాదకీయం

సుఖాంతమైన సీఎం వివాదం

కర్నాటకలో ఓటర్లు కాంగ్రెస్ కు నిర్ణయాత్మకమైన విజయం సాధించి పెట్టారు. అంతటి మహత్తర విజయం దక్కినా ముఖ్యమంత్రిని ఎంపిక చేయడానికి మూడు రోజుల సమయం పట్టింది. దీనికి ప్రధానమైన కారణం ముఖ్యమంత్రిని ఎన్ను కోవడం మానేసి ఎంపికచేసేపద్ధతి అనుసరించడమే. కాంగ్రెస్‌లో ఈ సంప్రదాయం ఇందిరా గాంధీ హయాంలో అమలులోకి వచ్చింది. అప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం సీల్డ్ కవర్లలో ఎవరి పేరును సూచిస్తే వారు ముఖ్యమంత్రి అయిపోయేవారు. అంటే ప్రజలు ఎన్నుకున్న శాసనసభ్యులకు ముఖ్యమంత్రిని ఎన్నుకునే అవకాశమే లేకుండా పోయింది. శాసనసభాపక్షం అభిప్రాయంతో ఏ మాత్రం సంబంధం లేకుండా అధిష్ఠానం ఎవరిని కరుణిస్తే వారు ముఖ్యమంత్రి స్థానం దక్కించుకునే పద్ధతి వల్ల పార్టీ అంతర్గత వ్యవహారాల నుంచి ప్రజాస్వామ్య పద్ధతి అంతర్ధానం అయింది. ప్రస్తుతం కర్నాటకలో 135 సీట్లు సంపాదించినా ముఖ్యమంత్రిని ఎంపిక చేయడానికి ప్రయాస పడవలసి వచ్చింది. దీనివల్ల ప్రజలు చేకూర్చిన అఖండ విజయానికి సంబరపడే అవకాశం మాయమై పోయింది. మాజీ ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.కె.శివకుమార్ ముఖ్యమంత్రి స్థానం కోసం భీకరంగా పోటీ పడ్డారు. చర్చోప చర్చల తరవాత అధిష్ఠానం ఆశీస్సులతో సిద్ధ రామయ్య ముఖ్యమంత్రిగా ఉంటారని, డి.కె.శివకుమార్ ఉపముఖ్యమంత్రిగా ఉంటారని తేలింది. డి.కె.శివకుమార్ ను ఉపముఖ్యమంత్రి పదవితో సంతృప్తి చేయడానికి నానా అగచాట్లు పడవలసి వచ్చింది. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం వెనక డి.కె.శివకుమార్ పాత్ర నిర్ణయాత్మకమైంది. శివకుమార్ ముఖ్యమంత్రి కావాలనుకోవడంలో అభ్యంతర పెట్టదగింది ఏమీ లేదు. కానీ కాంగ్రెస్ శాసనసభా పక్షంలో బలాబలాల రీత్యా చూస్తే సిద్ధరామయ్యను సమర్థించే వారు 95 మంది దాకా ఉన్నారు. పైగా ఆయన అనుభవజ్ఞుడు. అయితే 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రధానంగా సిద్ధ రామయ్య మీదే ఆధారపడింది. కానీ అప్పుడు కాంగ్రెస్ ఓడిపోయింది. ముఖ్యమంత్రిగా ఎవరిని ఎన్నుకోవాలన్న అంశం శాసనసభా పక్షానికి వదిలేయకుండా అధిష్ఠానం జోక్యం చేసుకునే అవకాశాన్ని అట్టిపెట్టుకోవడం వెనక ఏదో ఆంతర్యం ఉండే ఉంటుంది. ఒకే నాయకుడి మీద ఆధారపడే పరిస్థితి ఉంటే ఎన్నికలకు ముందే తమ పార్టీ విజయం సాధిస్తే ఆ నాయకుడే ముఖ్యమంత్రి అవుతారని కచ్చితంగా చెప్పే అవకాశం ఉంటుంది. కానీ ఒకరికన్నా ఎక్కువ నాయకులు ఉన్నప్పుడు ఎవరిని ముఖ్యమంత్రిని చేయాలన్న అంశం ఎన్నికల తరవాత పరిస్థితినిబట్టి నిర్ణయించుకోవచ్చు లెమ్మన్న ధోరణి అధిష్ఠానాల్లో పెరిగిపోతోంది. కేంద్ర నాయకత్వమే అంత పటిష్ఠంగా లేనప్పుడూ ముఖ్యమంత్రి ఎవరో నిర్ధారించడానికి ప్రయాస పడవలసి వస్తోంది. తమది భిన్నమైన పార్టీ అని చెప్పుకునే బీజేపీలోనూ అధికారం అందివచ్చిన తరవాత కాంగ్రెస్‌లో ఉన్న రుగ్మతలు ఆ పార్టీకి కూడా అబ్బాయి. అయితే బీజేపీలో గెలిస్తే ఎవరు ముఖ్యమంత్రి అవుతారో ముందే ప్రకటించకుండా ఉంటే ఆ తరవాత మోదీ, అమిత్ షా ద్వయం ఇష్టాయిష్టాల మేరకే నిర్ణయాలు జరిగిపోతాయి. కార్యకర్తల అభిప్రాయాన్ని పరిగణించే అలవాటు బీజేపీకి ఎటూ లేదు. కేంద్ర నాయకత్వం బలహీనంగా ఉన్నప్పుడు అంతర్గత సవాళ్లను ఎదుర్కోవడం ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల శివసేనలో చీలిక రావడానికి కారణం కూడా అంతర్గత సమస్యలను పరిష్కరించే సామర్థం నాయకత్వానికి లేకపోవడమే. నాయకత్వంలో తగువులు తీర్చే సామర్థ్యం కొరవడడానికి తోడు ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరించాలన్న పట్టింపు లేకపోవడం సమస్యగా మారుతోంది.

ఇటీవల కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరిగినప్పుడు మల్లికార్జున్ ఖర్గేకు శశీ థరూర్‌కు మధ్య ఆరోగ్యకరమైన పోటీ జరిగింది. అందువల్ల కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజా స్వామ్యానికి మళ్లీ బీజాంకురాలు పడ్డాయనుకోవడం కేవలం భ్రమేనని త్వరలోనే తేలిపోయింది. ఆ మాత్రం ప్రజాస్వామ్య ప్రక్రియకు కూడా తావులేకుండా శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నుకోవడం కాకుండా ఎంపికచేసే విధానమే కొనసాగు తోంది. రాజకీయ పార్టీల నిబంధనావళిలో ఏ పార్టీ అయినా సముచిత సూత్రాలు చేర్చడంలేదు. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యుల్లో 60 శాతం పైగా సిద్ధ రామయ్యే ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నట్టు ప్రచారం జరిగింది. నిజానికి అందరు శాసనసభ్యులు రాసిచ్చింది అధిష్ఠాన నిర్ణయానికి కట్టుబడి ఉంటాం అన్న ఒకే వాక్యం ఉంది. గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గడ్‌లో కూడా కాంగ్రెస్‌కు ఇదే సమస్య ఎదురైంది. ఆ రెండు చోట్లా ఇద్దరేసి పోటీ పడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లో భూపేశ్ బఘేల్, టి.ఎస్. సింగ్ దేవ్ మధ్య పోటీ జరిగితే అధిష్ఠానం బఘేల్‌ను ఎంపిక చేసింది. అలాగే రాజస్థాన్‌లో గెహ్లాత్, సచిన్ పైలెట్ కు మధ్య పోటీ ఉండేది. గెహ్లాత్ ముఖ్యమంత్రి అయ్యారు. అయినా వివాదం సద్దు మణగలేదు. సచిన్ పైలెట్ ఇప్పటికీ తిరుగుబాటు బావుటా చేత పుచ్చుకునే తిరుగుతున్నారు. కర్నాటకలోని లింగాయత్, ఒక్కలిగ లాంటి బలమైన సామాజిక వర్గాలున్నాయి. ఆ రెండింటి మధ్య పోటీ కూడా ఉంది. శివకుమార్ ఒక్కలిగ వర్గానికి చెందినవారు. ఈ రెండు సామాజిక వర్గాలకు కాకుండా సిద్ధ రామయ్య కురబ కావడం కూడా ఆయనకు అనుకూలించింది. ఇతర వెనుకబడిన వర్గాలు, ముస్లింలు, దళితులు కూడా ఆయనను సమర్థిస్తారు. కొంతమంది లింగాయత్‌ల మద్దతూ ఉంది. ముఖ్యమంత్రి పదవి దగ్గరకు వచ్చేటప్పటికి ఈ ఇద్దరు నాయకుల మధ్య విభేదాలు ఉండొచ్చు కానీ ఇటీవలి ఎన్నికల్లో విభేదాలు పక్కన పెట్టడంవల్లే విజయం సాధ్యమైంది. సిద్ధ రామయ్యను అంతిమంగా ఎంపిక చేసింది కాంగ్రెస్ అధిష్ఠానమే అయినా, రెండు మూడు రోజుల సమయం పట్టినా శివకుమార్‌ను మాలిమి చేయగలిగింది. అన్నింటి కన్నా మించి శాసనసభ ఎన్నికలలో స్థానిక నాయకులకు ప్రాధాన్యం ఇచ్చింది. దీనికి విరుద్ధంగా బీజేపీ మాత్రం 1970లు, 80లలో లా కాంగ్రెస్ వ్యవహరించినట్టే స్థానిక నాయకులను పక్కన పెట్టింది. అధిష్ఠాన వర్గాలు ఢిల్లీలో హుకుంలు జారీ చేయడం దీర్ఘ కాలికంగా ఏ పార్టీకైనా ప్రమాదకరమే. ప్రస్తుతానికి కాంగ్రెస్ ఈ సంకటం నుంచి బయట పడగలిగింది.

అధికార కేంద్రీకరణలో ఉన్న ముప్పు గ్రహించడం ఏ పార్టీకైనా ఉపకారమే చేస్తుంది. 2019 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల తరవాత అన్ని శాసనసభ ఎన్నికల్లోనూ బీజేపీ స్థానిక నాయకులను పట్టించుకోవడం లేదు. మహారాష్ట్ర, హర్యానా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్ లో బీజేపీ ఆ రాష్ట్రాల నాయకులను పట్టించుకోలేదు. ఒక్క ఆదిత్యనాథ్ కు మాత్రమే స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం వచ్చింది. వికేంద్రీకరణవల్ల ప్రయోజనం ఎంత ఉందో కాంగ్రెస్ లాంటి పార్టీల్లో ప్రమాదమూ అంతకన్నా ఎక్కువే. ఆ స్థితిలో ఒకటికన్నా ఎక్కువ అధికార కేంద్రాలు ఏర్పడతాయి. ఇందిరా గాంధీ వికేంద్రీకరణకు మంగళంపాడితే రాజీవ్‌గాంధీ రాష్ట్రస్థాయి నాయకులను అవమానించిన సందర్భాలు ఉన్నాయి.

భయం వల్లనే భక్తి

అంజనీ పుత్ర నమోస్తుతే శ్రీ రామ భక్తునికి నమోస్తుతే... రావయ్యా బావ పార్వతి మీ అన్నయ భక్తితో పరవశుడై వస్తున్నాడు వేడివేడి కాఫీ పట్టుకురా. ఇప్పుడు చెప్పు అ మధ్య శ్రీ రామ నీనామ మెంతోరుచిరా అంటూ వచ్చావు ఈ రోజేమో ఆయన భక్తుడు అంజనేయ జపం చేస్తూ వస్తున్నావు ఏమిటి కథ. ఏముంది బావ నవమికి రామ జపం ఇప్పుడు వాయుపుత్రుడి జయంతి కొలవాలిగదా. అది సరే ఇంత మందిని కొలిచే మీ వార్డు ఎప్పుడూ ఏదో ఉపద్రవాలకు లోనవుతూ ఉంటుంది. ఎంతోమంది దేవుళ్లను ఎంతో భక్తి శ్రద్ధలతో కొలిచినా ఆ దేవుళ్లు కరుణించడం లేదు ఎందుకని..ఏముంది పాపం పెరిగిపోతోంది పక్కవాడ్ని పాపభీతిలేకుండా దోచుకోవడం అవసరమైతే ప్రాణాలు తీయడం లాంటి దుర్మార్గపు పనులుచేసి దేముడికి నామజపంచేస్తే ఆ రాముడు కరుణిస్తాడా. అది సరే మంచివాళ్లను సంహరించడం భగవంతుని బాధ్యత కదా అందుకే కదా అన్ని అవతారాలెత్తింది. ఏమోకాని అందరూ ప్రార్థిస్తుంటే మనం చేయకుంటే మనల్ని శిక్షిస్తాడు కదా. అసలు భగవంతుడు ఉన్నాడంటావా. అదేంటి అంత మాట అనేశావు. పాపం మూటకట్టుకుంటున్నావు. నీవన్నట్లు దుష్టశిక్షణ శిష్టరక్షణా ఆయన బాధ్యత అయినపుడు ఇన్ని దుర్మార్గాలు జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం ధర్మమా. అసలు దేముడు అంటున్నాం. వేదాంతులేమో నిరాకారుడు, నిర్వికల్పుడు, నిర్గుణుడు అంటారు. అంటే

దేముడని మనం భ్రమించేవారికి ఒక ఆకారం గాని, గుణంకాని, కోరికగాని లేవని చెబుతారు. అలా ఏ ఆకారం లేనివారిని 'డు' అని ఎలా పిలుస్తారు. ఆగు అక్కడే ఆగు బావ. దానికి నేను విన్న సమాధానం చెబుతా. నిరాకారుడంటే కరెక్టుగ ఒక ఆకారంలో ఉండడు. నీవన్నట్లు దుష్టులను శిక్షించే టప్పుడు ఒక ఆకారం, శిష్టులను రక్షించేటపుడు ఒక ఆకారంలోను ఉంటాడు. అందుకే ఆయన దశావతారాలతో కనిపించ దానికి కారణం. అలాగే నిర్గుణుడు అంటే ఎప్పుడూ ఒకే గుణం కలిగి ఉండడు. దుష్టులను శిక్షించేటపుడు శిష్టులను రక్షించేటపుడు ఒక్కో గుణంతో ప్రవర్తిస్తాడు. నిర్వికల్పుడు అంటే ఆయనకు ఏ కోరికలూ ఉండవు. భక్తుల కోరికలు తీర్చడమే ఆయన కోరిక. బాగానే నేర్చు కున్నావు. మరి వార్డులోని దుర్మార్గులను సంహరించడానికి ఏదో ఒక అవతారంతో రావచ్చుకదా. ఆగు చెబుతా ఆ దుర్మార్గులు చెడ్డపనులు మాని మంచి వారుగ మారతారేమోనని వేచిచూచి దుర్మార్గం ముదిరిన తరువాత ఆయనవేసే శిక్ష మనముందే జరుగుతుంది. అలా ఎంతమంది మన కళ్లముందు ఎంత ఘోరంగా దుర్మరణం పాలయ్యారో మన కళ్లతో మనం చూశాం కదా. బాగానే ఒంట పట్టించుకున్నావు. నాకు తెలియక అడుగుతాను కొంతమందితో అన్ని దుర్మార్గాలు చేయించి మంచివాళ్లను బాధపెట్టి ఆ తరువాత చంపడం దేనికి? ఆదిలోనే అంతం చేస్తే ఇంత మంది ఇన్ని రకాలుగ ఇక్కట్లు పాలవరుకదా. అదీ చెబుతా ప్రతి వ్యక్తికి గత జన్మలో చేసిందాన్ని బట్టి ఉంటుంది. ఎవరు చేసిన పాపం వారు అనుభవించక తప్పదుకదా అందుకేమంచి వాళ్లు, చెడ్డవాళ్లుగ పుట్టి గత జన్మను బట్టి ఈ జన్మలో అనుభవిస్తారు. అది సరే పునర్జన్మ అనేది ఉన్నదంటావా భలేవాడివి లేకపోతే కొంతమంది పుట్టిన నెలరోజులకే గత జన్మ గురించి చెబుతున్నారుకదా. మరుజన్మఉంటే చనిపోయేవారి కంటే పుట్టేవారే ఎక్కువకదా. ఎలా జనాభా పెరుగుతోంది. అందుకే కదా ఫ్యామిలి ప్లానింగ్. మరి ఒకరుపోతే పదిమంది పుడితే మిగతావారికి గత జన్మలోని ఆత్మలు ఏమవుతున్నాయి. ఆ వస్తున్నా అందుకే ఈ జన్మతో మంచి పనులు చేసినవారికి జన్మరాహిత్యంతో మరుజన్మ లేకుండా చేస్తున్నాడు ఆ భగవంతుడు.

అది సరే ప్రస్తుతం మన రాజకీయ నాయకులు ప్రజాధనం వేలకోట్లు దోచుకుతింటున్నారు. మనకళ్లముందే అనుభవిస్తారన్నావు. మన కళ్లముందు నీవన్నట్లు శిక్షకాదు అనుభవించేది, విలాసవంతమైన భోగాలు మరి వారి పట్ల నీవు నమ్మిన భగవంతుడు ఏమీ తెలియనట్లు మిన్నకున్నాడు. పేద ప్రజలు ఆకలితో అలమటించినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నాకుతెలియక అడుగుతాను. లక్షలకోట్లు విదేశీ బ్యాంకులో దాచి సంతృప్తి పడటం తప్పవారు అనుభవించలేరు. దాని కంటే ఆ సొమ్ము సమాజపరం చేసి పేదలను ఆదుకునేట్లు మీ దేముడు వారి మనసు మార్చలేడా. నీకొక సంగతి చెబుతా విను. కొందరికి సంపాదించడంలో తృప్తి మరికొందరికి పేదలకు అన్నంపెట్టి వాళ్ల కళ్లల్లో వెలుగునుచూస్తే సంతృప్తి వాళ్లు అభిరుచిని బట్టి వారు వ్యవహరిస్తారు అది సరే వారంతా సంఘజీవులే కదా. సమాజానికి అతీతంగా బతకడంలేదు కదా. మరి సమాజం తీరు తెన్నులు గమనించి అందరికీ న్యాయం చెయ్యవలసిన బాధ్యత ప్రజలెన్నుకున్న ప్రభుత్వానికి ఉన్నది కదా. భలే అమాయకుడివి. ఏలేవారు సంపదకోసం పరుగులు పెడుతుంటే ఇంకా వీళ్లమీద చర్యలు తీసుకొనేదెవరు అంటే నీవు నమ్మే భగవంతుడిని కూడా వాళ్లు కొనేశారా. అంతలోతుగ చర్చ ఎందుకుగాని నమ్మినోడికి ఉన్నాడు లేని వాడికి లేడు అంతే భయంవల్ల భక్తి అనుకో.

వ్యాస రచయిత సెల్:9886569394

భారత్‌లోనే పేదలెక్కువ

కృష్ణ ఝా

అభివృద్ధిచెందిన ఐదు దేశాల్లో భారతదేశం కూడా ఒకటని బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం డప్పు కొట్టుకొంటోంది. ఇది వాస్తవంకాదని మోదీకి తెలియకపోలేదు. అయినప్పటికీ ఏదో సాధించి నట్లుగా ప్రచారం చేసుకోవడం మోదీకి బాగా అలవాటైన విషయం. దేశ జీడీపీ నిరంతరం తగ్గిపోతూనే ఉంది. అయినప్పటికీ దేశం అభివృద్ధివైపు పయనిస్తోందని దాదాపు దశాబ్దికాలంగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను భ్రమల్లో ముంచుతున్నారు. వాస్తవం చెప్పకుండా భ్రమలు కల్పించడం ప్రజలను మోసగించడమే అవుతుంది. 2014లో అధికారానికి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం 2011-12 నుండి గణాంక సంస్థలు అందించిన వివరాలను వెల్లడించకుండా దాచివేసింది. ప్రపంచబ్యాంకు భారతదేశంలో ఉన్న అత్యంత తీవ్ర పేదరికాన్ని బైటపెట్టింది. ప్రపంచ బ్యాంకు సర్వే ప్రకారం భారతదేశంలో సగటున ఒక వ్యక్తి 1.5డాలర్ల మేరకు ఆదాయం పొందుతూ జీవిస్తున్నాడు. ఈ సర్వే ప్రకారం దేశంలో 1.5 డాలర్ల లోపు ఆదాయంతో జీవిస్తున్న వారి సంఖ్య 23శాతం ఉంది. ప్రపంచంలోని అన్ని దేశాల్లో పేదరికం భారతదేశంలోనే ఎక్కువగా ఉంది. 2011-12 నాటి నుంచి మనకు ఇంతవరకు లభించిన సమాచారం ఇదే.

పేదరికంపై అధికారిక గణాంకాలు లభించడంలేదు. పేదరికం ఎంత అనేది ఊహించడమే అవుతుంది. ఊహాజనితంగా వివిధవర్గాల నుంచి సేకరించిన గణాంకాలు మాత్రమే మనకు లభిస్తున్నాయి. అధికారికంగా ఎలాంటి ధృవీకరణ ఉండదు. జాతీయస్థాయి సర్వేఫలితాలను ధృవీకరణ లేని వర్గాలద్వారా వెల్లడైన గణాంకాలతో పోల్చిచూసే అవకాశంకూడా లేదు. అధికారిక గణాంకాలు వెల్లడైనా ఖచ్చితంగా వాస్తవ గణాంకాలకంటే తక్కువగానే ఉంటాయి. అధికారిక గణాంకాలు ఎట్టి పరిస్థితుల్లోనూ బైటకు రావడం లేదు. 2017-18 నాటి నుంచి జాతీయ నమూనా సర్వే, వినిమయ వ్యయం సర్వే, ఫలితాలను ప్రభుత్వం వెల్లడించడం నిలిపి వేసింది. సర్వే ఫలితాల వివరాలు ప్రభుత్వం దాటివేసింది. అనధికారిక గణాంకాల వివరాలను పరిశీలిస్తే పేదరికం అత్యంత తీవ్రంగా ఉందనేది

స్పష్టమవుతోంది. 2024లో లోకసభ ఎన్నికలు జరుగనున్నందున ఈ గణాంకాలు వెల్లడైతే ప్రతి కుటుంబానికి వాస్తవ విషయం తెలిసిపోతుంది. అప్పుడు ఓటర్లు ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రభుత్వ అభివృద్ధి ప్రత్యేకించి ఆర్థికవ్యవస్థ ఎలా ఉంది, ప్రభుత్వ సామర్థ్యం ఏమిటి అనే అంశాలపై ఒక అంచనాకు రావల్సిన సమయం ఇది. అంగీకృత వర్గాల నుంచి సంబంధిత అంశాల సర్వే వివరాలు మనకు లభించడంలేదు. ఆర్థిక రంగ సూచికలు స్పష్టంగాలేవు. ప్రజలు సగటున తలసరి వ్యయం ఎంత అనేది తెలుసుకునే అవకాశం ఉంటే తద్వారా అంచనా వేయడానికి కొంత మేరకు వీలు కలుగుతుంది. అయితే ప్రపంచబ్యాంకు తమకు లభించిన సూచికల ప్రకారం భారతదేశంలో తీవ్ర పేదరికం నెలకొని ఉందని స్పష్టం చేసింది. ఆయా దేశాలలో పేదరికం స్థాయిలు భిన్నంగానే ఉంటాయి. భారత ప్రభుత్వం నియమించిన తెండూల్కర్ కమిటీనివేదిక ప్రకారం, 2011-12 వ సంవత్సరంలో 22 శాతం ప్రజలు పేదరికంలో జీవిస్తున్నారు. 2011-12నాటివరకు ఉన్న పేదరికం గణాంకాలే ఇప్పటివరకు ఆధారం. ఆనాడుకూడా సగటున వ్యక్తి వినిమయ ఖర్చు వివరాలు వెల్లడయ్యాయి. అప్పుడు వ్యక్తికి 1.90 డాలర్ల ఆదాయం తీవ్ర పేదరికానికి సంకేతంగా అంచనావేశారు. కరోనా మహమ్మారి ప్రారంభం కాకముందే ఇదే వ్యయాన్ని ఆధారం చేసుకుని పేదరికం స్థాయిని నిర్ణయించింది.

ప్రపంచబ్యాంకు కన్సూమర్ పిరమిడ్‌హౌస్ హెూల్డ్ సర్వే (సీపీహెచ్ ఎస్) అందించిన సమాచారాన్ని తీసుకొని పేదరికాన్ని నిర్ణయించింది. భారత ఆర్థిక రంగ పరిశీలకకేంద్రం (సీఎమ్ఐఈ) ఆ సమాచారాన్ని సేకరించింది. అయితే 2011-12 తరువాత 2019-20లో సేకరించిన సమాచారం ప్రకారం పేదరికం రేటు 10శాతమే ఉందని అధికారిక అంచనా. ప్రభుత్వం ఈ అంశంపై ఏనాడూ చిత్తశుద్ధితో పరిశీలించలేదు. ప్రపంచబ్యాంకు వివిధ ప్రైవేటు సంస్థల నుంచి సమాచారాన్ని తీసు కుంటుంది. అలా సమాచారం అందించేవాటిలో న్యూ పావర్టీ వెబ్‌సైట్ ఒకటి. వాస్తవంగా కొలంబియా యూనివర్సిటీలో సమర్పించిన పత్రం వివరాలు ఇంకా ప్రపంచానికి వెల్లడికాలేదు. అందులో ప్రజలు మరింత పేదరికంలోకి కరోనాతర్వాత జారిపోయారన్న అంశాన్నికూడా పేర్కొన్నారు. దఫదఫాలుగా లేబర్‌ఫోర్స్ సర్వేను జాతీయ గణాంకాల కార్యాలయం నిర్వహిస్తుంది. అలాగే వ్యవసాయం వాటా పారిశ్రామిక అభివృద్ధితో పోలిస్తే తక్కువగా ఉంటోంది. ఇది 1990లనుండి 2004వరకు ఒకే విధంగాఉంది. 16నుండి 17శాతం వరకు నమోదైంది. వ్యవసాయదారుల సంఖ్యసైతం 50 నుండి 43శాతానికి పడిపోయింది. దక్షిణాసియా దేశాలైన బంగ్లాదేశ్, చైనా తదితర దేశాలలో మన దేశ జీడీపీ కంటే ఎక్కువగా నమోదైంది. దేశంలో పేదరికం స్థాయిని ఎల్లవేళలా గుప్తంగానే ఉంచు తున్నారు. జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు తీసుకునే చర్యలు ప్రజలకు ఊరట కలిగించడం కంటే వారిమీద ఒత్తిడి చేసేలాగా ఉంటున్నాయి. ఆహారం, వ్యవసాయసంస్థలు (ఎఫ్ఏఓ) సేకరించిన సమాచారం సక్రమంగానే ఉంటోంది. తలసరి వినిమయాన్ని ఇది తెలియ జేస్తోంది. 2019-21మధ్యకాలంలో లభించిన సమాచారం ప్రకారం, వినిమయం రేటు పెరగలేదు. వాస్తవంగా గత ఏడాది నుంచి పేదరికంపై చర్చసాగుతోంది. అయితే ప్రభుత్వం మాత్రం కరోనా మహమ్మారికి ముందే పేదరికం నుంచి దేశం విముక్తి పొందిందని చెబుతోంది.

గ్రామీణభారతం ప్రగతికి సోపానం

ఈ-మెయిల్

పల్లెలో ప్రగతికి సోపానాలు. నిజమైన భారతదేశం పల్లెలలోనే ఉందని మహాత్ముడు ఏనాడో ఉద్ఘాటించాడు. పల్లె తల్లి వంటిదనే నానుడి ఏనాటిదో తెలియదు కాని ఇది అక్షరసత్యం. నగరాల్లో జీవిస్తున్నా పల్లెల గొప్పదనాన్ని విస్మరించరాదు. పచ్చని పైర్లతో, ఆహ్లాదకరమైన వాతావరణంతో అలరించే ప్రకృతిమాత చల్లని దీవెనలు పల్లెల స్వంతం. పల్లెలే ప్రగతికి సోపానాలు. సాంకేతిక విప్లవం కారణంగా ప్రపంచం మొత్తం ఒక కుగ్రామంగా మారిన తరుణంలో పల్లెలన్నీ నగరీకరణ, ప్రపంచీకరణ పేరుతో కట్టలు తెంచుకుని పరుగులుపెడుతున్న నేపథ్యంలో మానవుల మధ్య సంబంధాలు కూడా అంతే వేగంతో దిగజారి పోతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు అంతరించి స్వేచ్ఛ, ప్రైవసీ పేరుతో న్యూక్లియర్ కుటుంబాలుగా అవతరిస్తున్నాయి. పల్లెలన్నీ నాగరికత పేరుతో నగర వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి. ఒకప్పుడు ఆహ్లాదకరంగా ఉండే పల్లె వాతావరణం గతకాలపు వైభవంగా చరిత్రలో కలిసిపోయింది. పల్లెజనం తమ అస్థిత్వాన్ని విడనాడి, నగరాలవైపు వలసపోతున్నది. గ్రామా లంటే కంటగింపుగా మారాయి. కృత్రిమ వాతావరణంలో, కాంక్రీటు అరణ్యాలలో అధునాతన కట్టడాలలో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న నేటి పోకడలను చూస్తుంటే భయమేస్తుంది. జనసంద్రంలా మారిన నగర వాతావరణంలో ఇమడ లేని జనం కూడా ఒకప్పటి పల్లెవాతా వరణాన్ని గుర్తుచేసుకునేలా శుభకార్యాలు, పర్వదినాలపేరుతో, మార్నింగ్‌వాకింగ్ల పేరుతో పార్కుల్లో నలుగురితో కలిసిపోయి ఆత్మీయంగా పలకరించు కుంటూ, చక్కని సంబంధాలను నెలకొల్పుకుంటున్నారు. విదేశాల్లో ఉండే భారతీయులు కూడా అలనాటి భారతీయ సంస్కృతిని, కలుపుగోలుతనాన్ని గుర్తు చేసుకుంటూ తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవడం గమనార్హం. పల్లెలేమో నాగరికత మోజుతో విలువలను విధ్వంసం చేసుకుంటున్నాయి. పల్లెలను వీడి నగరాలవైపు పరుగుతీయడం బాధాకరం.

దేశంలో జనాభా పెరుగుతున్నది. పెరిగిన జనాభాతో పాటుగా, పోటా పోటీగా అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అవసరాలకు తగ్గట్టుగా వనరుల కల్పనకూడా కష్టమౌతున్నది. విద్యావకాశాలు మెరుగుపడ్డాయి. చదువుకున్న యువతకు చదువుకు తగ్గరీతిలో ఉపాధి అవకాశాలు కలగడం లేదు. నిరుద్యోగ యువత ఉద్యోగవేటలో నగరాల్లో తిరుగుతూ నరకయాతన అనుభవిస్తున్నారు. మురికివాడలు పెరిగిపోయాయి. చాలీ చాలని సంపాదనతో రేయింబవళ్లు శ్రమచేస్తూ, భారమైన బ్రతుకులతో బయటకు చెప్పుకోలేని బాధలను అనుభవిస్తున్నారు. హాయిగా ఉండే పల్లెల్లో పనులు చేయడం నామోషీగా భావించడం వలనే ఇలాంటి అస్థవ్యస్థ పరిస్థితులు దాపురిస్తున్నాయి.

సుంకవల్లి సత్తిరాజు, సెల్: 9704903463

క్యూబాపై ఆంక్షల రద్దుకు బైడెన్‌మీద ఒత్తిడి

బ్రంకో మార్సిటిక్

అమెరికాకు ఇప్పటికీ యుద్ధాలపట్ల ఆకలి తీరలేదు. ఎక్కడైనా రెండు దేశాల మధ్య యుద్ధమో, తీవ్ర ఘర్షణలు జరిగితే ఇద్దరికీ ఆయుధాలు అమ్ముకుని ఒకరికి మద్దతు ఇచ్చే విధానాన్ని పాటిస్తోంది. అదే సమయంలో చిన్న చిన్న దేశాలపై అర్థిక తదితర ఆంక్షలు విధించి వాటి పరిస్థితిని దిగ జారుస్తోంది. విధించే ఆంక్షలు సైతం క్రూరంగా, వివక్షా పూరితంగా, అక్రమంగా, చట్ట విరుద్ధంగా ఉంటున్నాయి. ఆంక్షలు ఎత్తివేయవలసిందిగా అనేక దేశాలు విజ్ఞప్తి చేసిన ప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదు. వారం రోజుల క్రితం కాంగ్రెస్‌కు(పార్లమెంటు) చెందిన 21మంది డెమొక్రటిక్ పార్టీ సభ్యులు, అధ్యక్షుడు జో బైడెన్‌కి ఒక లేఖ రాశారు. అందులో క్యూబా, వెనిజులా దేశాలపై విధించిన ఆంక్షలను ఇప్పటికైనా తొలగించాలని పేర్కొన్నారు. అలాగే డొనాల్డ్ ట్రంప్ పాలనాకాలంలో ఆంక్షల విధానం సర్వసాధారణమైపోయింది. సరిహద్దుల్లో సంక్షోభం ఏర్పడి దక్షిణ సరిహద్దులనుండి దేశంలోకి వలసలు ఎక్కువయ్యాయి. ట్రంప్ ఆనాడు జారీ చేసిన ఆర్డర్‌ను కూడా రద్దు చేయాలని ఆ లేఖలో డెమోక్రటిక్ సభ్యులు కోరారు. పాలకపార్టీకి చెందిన సభ్యులే విజ్ఞప్తిచేయడం వల్ల వారి మాట అధ్యక్షుడు వింటాడని కూడా భావించలేం. ఆంక్షలకు గురైన దేశాలలో ప్రజలు అత్యంత తీవ్రమైన కష్టాలకు గురవుతున్నారని ఈ కష్టాలు అమెరికా వల్లనే జరుగుతున్నాయని లేఖలో పేర్కొన్నారు.

రెండు సరిహద్దు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు వెరోనికా ఎస్కోబర్ (డి-టిఎక్స్), రాల్ గ్రిజల్వా (డి-ఏజెడ్) లేఖపై సంతకం చేసిన వారిలో ఉన్నారు. 2024లో బైడెన్ తరఫున ఎన్నికల ప్రచారం చేయనున్న కమిటీ ఉపాధ్యక్షుడు రాల్ గ్రిజల్వా మరొకరు సెనేటర్ బెర్నిశాండర్స్. వీరుగాక అనేకమంది ప్రగతిశీల సభ్యులు ఉన్నారు. వారిలో ఖన్నా, ఛుయి గార్సియాలతోపాటు కొత్తగా ప్రగతిశీల సోషలిస్టు సభ్యుల స్క్వాడ్‌లో చేరిన మరో ఆరుగురు కూడా ఉన్నారు.

కొత్తగా చేరినవారిలో ఇహాన్ ఒమర్, సమ్మర్‌లి అయన్నా ప్రెస్‌లీ లేఖపై సంతకం చేయలేదు. మసాచుసెట్స్ నుండి గెలుపొందిన జిమ్ మాక్ గవర్న్ గతంలో కూడా అనేకసార్లు క్యూబా, వెనిజులాపై ఆంక్షలు తొలగించవలసిందిగా బైడెన్‌కు విజ్ఞప్తి చేశారు. లేఖపై ఇప్పుడు ఆయనకూడా సంతకం చేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నార్తంప్టన్ కార్యాలయం ముందు ప్రదర్శన కూడా చేశారు. ఇంకా అనేకమంది ప్రగతిశీలురు వివిధ వేదికలకు ఈ సందేశం పంపించారు. మే 11వ తేదీన కాంగ్రెస్ వ్యవసాయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనూ అనేక దశాబ్దాలుగా క్యూబాపైన అమెరికా దిగ్బంధం విధించడాన్ని ఖండించింది. ఇప్పటికైనా మన విధానాలను సమీక్షించుకుని ఆయా దేశాలలో ప్రజలను హింసించడం మానుకోవాలని చాలా మంది సభ్యులు కోరారు. మన దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టం కలుగుతుందని వారు హెచ్చరించారు. ఇతర దేశాల ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే అదిమన ప్రయోజనాలకు ఏమీ తోడ్పడదు. ప్రపంచ ప్రజలందరికీ ఆహారం అందేలా చూడవలసిన కర్తవ్యం ఉందని సమావేశంలో మాట్లాడిన గ్రెడ్జ్‌కాసర్ తెలియజేశారు. వెనిజులా, క్యూబా దేశాల నుండి ప్రజలు ఇతర దేశాలకు తరలి వెళు తున్నారని ఈ నేపథ్యంలో ఆంక్షలు తొలగించడం న్యాయంగా ఉంటుందని సభ్యులు విజ్ఞప్తి చేశారు. అయితే రిపబ్లికన్ పార్టీ సభ్యులు మాత్రం ఇంకా ఆంక్షలు పెంచాలని కోరుతున్నారు. ఆంక్షలు పెంచితే మరింత మంది ప్రజల జీవనం తీవ్రంగా దెబ్బతింటుంది. ప్రజలు తండోప తండాలుగా వలసవెళ్లడం, ఆహారంలేక పస్తులుండటం జరుగుతుంది. అది మన లక్ష్యం కాకూడదు. అని సభ్యులు తమ లేఖలో కోరారు.

క్యూబా, వెనిజులా దేశాలలో ప్రభుత్వాలను మార్చివేయడమే లక్ష్యంగా పెట్టుకుని ఆంక్షలు విధిస్తున్నారు. దాదాపు ఆరుదశాబ్దాల కాలంగా క్యూబాను హస్తదిగ్బంధనం చేశారు. అయినప్పటికీ సోషలిస్టు దేశం క్యూబా ఆంక్షలను తట్టుకుని నిలిచి అనేక రంగాలలో పురోగతి సాధించింది. ముఖ్యంగా వైద్యరంగంలో అపారమైన పురోగతి సాధించింది. ఒబామా హయాంలో క్యూబా ప్రజలకు మెరుగైన జీవనం అందించాలన్న విధానం ఉండేది. ఆనాటి అరమరికలులేని పరిస్థితికి తిరిగివెళ్లాలని, ఇప్పటికైనా సరైన పద్ధతిలో ఆలోచించాలని సభ్యులు కోరారు. సరిహద్దుల్లో జరుగుతున్న సంఘటనలు బైడెన్ ప్రభుత్వానికి రాజకీయంగా నష్టం కలుగ చేస్తాయని, అందువల్ల ట్రంప్ కాలంలో విధించిన మరిన్ని ఆంక్షలతో పాటు అన్నిటినీ తొలగించాలని ఆ లేఖలో సభ్యులు విజ్ఞప్తి చేశారు. వామపక్షవాది మెక్సికో అధ్యక్షుడు ఆండ్రస్ మాన్యుయెల్ లోపెజ్ ఒబ్రదార్ కూడా ఇదే విధంగా బైడెన్‌కు విజ్ఞప్తి చేశారు. సరిహద్దుల నుండి దేశంలోకి వలసవస్తున్నవారు ఎందుకు వస్తున్నారనేది ఆలోచించాలని, కేవలం ఆంక్షలే కారణమని ఒబ్రదార్ తెలిపారు. ఆ దేశాలలో పేదరికం నుండి ప్రజలు బైటపడకుండా ఉండటానికి అమెరికా విధించిన ఆంక్షలే కారణం. వెనిజులాలో పనిచేసే అమెరికా రాయబారి ఏడాదిక్రితమే ట్రంప్ విధానాన్ని ఎత్తివేయాలని బైడెన్‌ను కోరారు. వెనిజులాపై ఆంక్షలు తొలగించకపోతే అది మరో క్యూబాలాగా తయారవుతుందని ఆయన పేర్కొన్నారు.

సముచిత పరిహారమివ్వాలి

- 'భారత్‌మాలా' భూసేకరణకు వ్యతిరేకంగా పంజాబ్ రైతుల నిరసన
- మహిళను కొట్టిన పోలీసు - ఆందోళనకారుల్లో కొందరు అరెస్టు

అమృత్‌సర్: భారత్‌మాలా ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సేకరించిన భూములకు సరిపడ పరిహారం ఇవ్వకపోవడంతో పంజాబ్‌లోని కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కేఎంసీ)కి చెందిన రైతులు గురువారం ఆందోళన బాట పట్టారు. లూథియానా నుంచి జలంధర్‌కు అమృత్‌సర్ జలంధర్-జమ్ము రైల్వే ప్రధాన మార్గాన్ని నిరసనకారులు దిగ్బంధించారు. దేవిదాస్‌పూర గ్రామంలో రైల్వేట్రాక్‌పై బైఠాయించి నిరసన తెలిపారు. సముచిత పరిహారం ఇవ్వాల్సిందేనని ప్రభుత్వానికి తేల్చిచెప్పారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతమవుతాయని హెచ్చరించారు. రైతుల ఆందోళన కారణంగా అమృత్‌సర్, దిల్లీ మధ్య రైళ్లను మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అయితే భూసేకరణకు వ్యతిరేకంగా దిల్లీ-కాత్రా జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న మహిళా రైతును పోలీసు చెంపదెబ్బ కొట్టడానికి నిరసనగా రైతులు ఆందోళనలు చేశారు. కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కేఎంసీ) అధ్యక్షుడు సర్వర్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ నిరసనకారులపై పోలీసుల దమనకాండ కొనసాగిందన్నారు. వృద్ధురాలిపై చేయిచేసుకోవడమే కాకుండా మరొక రైతు తలపాగాను లాగేయడం ఆక్షేపణీయమన్నారు. గురుదాస్‌పూర్ జిల్లాలోని భంగ్రీ గ్రామం వద్ద పోలీసులను భారీ సంఖ్యలో మోహరించినట్లు తెలిపారు. మహిళలను పోలీసులు దూషించారని, అనేక మంది రైతులను అరెస్టు చేశారని పంధేర్ చెప్పారు. పరిహారం చెల్లించకుండా భూ సేకరణ జరగబోదని రైతులకు ప్రభుత్వానికి మధ్య ఒప్పందం జరిగిందని, ఆగస్టు వరకు సమయాన్ని ప్రభుత్వం కోరిందని తెలిపారు. అయితే జలంధర్ ఉప ఎన్నికలో విజయం తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే దిగిరాకపోతే శుక్రవారం పంజాబ్‌వ్యాప్తంగా రైల్వేలైన్లను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కేఎంసీ అధికార ప్రతినిధి గుర్‌బచన్ సింగ్ ఛాబా మాట్లాడుతూ రైతుల భూములను సేకరిస్తున్న ప్రభుత్వం వారికి సముచిత పరిహారం చెల్లించడం లేదని, అందుకోసం ఆందోళన బాట పట్టక తప్పడంలేదని తెలిపారు. గురుదాస్‌పూర్ జిల్లాలో ఓ మహిళా రైతుపై పోలీసు చేయిచేసుకున్నట్లు ఆరోపించారు. నిరసన తెలుపుతున్న రైతులపై పోలీసుల బలప్రయోగాన్ని ఖండించారు. రైతులను వారి భూముల నుంచి బలవంతంగా పంపించేందుకు ప్రభుత్వం, పోలీసులు అనుసరిస్తున్న తీరు ఆక్షేపణీయమన్నారు. దిల్లీ-కాత్రా జాతీయ రహదారి విస్తరణ/నిర్మాణం కోసం వ్యవసాయ భూముల సేకరణకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారని, ఇది చీమా ఖుడి గ్రామంలో జరిగిందని తెలిపారు. మహిళా రైతును పోలీసు కొట్టిన వీడియో వైరలైంది. ఈ ఘటన ఖాకీ క్రౌర్యానికి అద్దంపడుతుందని విమర్శించారు. కాగా భారత్‌మాలా ప్రాజెక్టు భూసేకరణకు వ్యతిరేకంగా గురుదాస్‌పూర్‌లో రైతులు గతనెలలోనూ ఆందోళన చేశారు. హైవేలు, రైల్వేలైన్లను దిగ్బంధించారు. రైల్వేట్రాకులపై ట్రాక్టర్లను నిలబెట్టి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా యంత్రాంగం నుంచి హామీలు లభించడంతో రైతులు తమ ఆందోళనను విరమించుకున్నారు.

అంచెలంచెలుగా ఎదిగిన డీకే శివకుమార్

బెంగళూరు: కాంగ్రెస్ పార్టీ కర్నాటక రాష్ట్ర అధ్యక్షుడు, ఒక్కలిగ సామాజిక వర్గానికి చెందిన డీకే శివకుమార్ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. రాజకీయాలపై ఆసక్తితో విద్యార్థి దశలోనే కాంగ్రెస్‌లో చేరారు. అదే పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పీసీసీ అధ్యక్ష పదవి పొందారు. ఈ క్రమంలో ఎన్నోసార్లు డీకేకు పార్టీ పార్టీకి డీకే అండగా నిలిచారు. డీకే శివకుమార్ 1985లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తొలిసారి సాథనూరు నుంచి దేవెగౌడపై పోటీ చేసి ఓడిపోయారు. 1989లో మళ్లీ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1990లో వీరేంద్రపాటిల్ సీఎం పదవి నుంచి దిగిపోయారు. అనంతరం కొత్తగా ఏర్పడిన ఎస్.బంగారప్ప మంత్రివర్గంలో డీకేకు చోటు దక్కింది. అప్పటికి ఆయన వయసు 30 సంవత్సరాలు. ఆ తరువాత నుంచి డీకే పరాజయం ఎరుగని నేతగా ఎదిగారు. 1989 నుంచి ఇప్పటివరకు జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా 8 సార్లు విజయం సాధించారు. 1999లో జేడీఎస్ నేత కుమారస్వామిని ఓడించి సాథనూరును తన కంచుకోటలా మలుచుకున్నారు. ఈ విజయం దేవెగౌడ కుటుంబానికి, డీకేకు మధ్య రాజకీయ వైరం పెంచింది. డీకేకు 'జెయింట్ కిల్లర్' అని పేరువచ్చింది. ఆ తరువాత ఎస్.ఎం కృష్ణ మంత్రివర్గంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా 2004 వరకు కొనసాగారు. అప్పటి నుంచే డీకే దశ తిరిగిందని రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు.

2004లో ధరమ్‌సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ - జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది. శివకుమార్‌కు మంత్రివర్గంలో చోటు దక్కలేదు. 2008లో తన సొంత నియోజకవర్గం సాథనూరును వీడి కనకపుర నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇప్పటివరకూ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. 2013లో తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన మంత్రివర్గంలో డీకేకు చోటు దక్కింది. సంక్షోభ సమయంలో పావులు కదపడంలో డీకే సిద్ధహస్తుడు. ఆయన ప్రతిభను గుర్తించిన అధిష్ఠానం అనేక సార్లు పార్టీ ఎమ్మెల్యేలను రక్షించే బాధ్యతను అప్పగించింది. 2002లో విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ మహారాష్ట్ర సీఎంగా ఉన్న సమయంలో ఆయనపై కొందరు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దాంతో మహారాష్ట్ర కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలకు డీకే ఆశ్రయం కల్పించి అవిశ్వాస తీర్మానం నుంచి విలాస్‌రావ్ గట్టెక్కేందుకు సహాయపడ్డారు. 2017లో రాజ్యసభ సభ్యునిగా అహ్మద్ పటేల్ గెలుపొందేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన గుజరాత్ ఎమ్మెల్యేలకు మరోసారి తన రిసార్టులో ఆశ్రయం కల్పించారు. అనూహ్యంగా ఆ సమయంలో ఐటీ సోదాలు జరిగాయి. 2018లో కర్నాటకలో కాంగ్రెస్ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సరిపడా స్థానాలు రాలేదు. దాంతో జేడీఎస్ సాయంతో ప్రభుత్వాన్ని నెలకొల్పడంతో డీకే కీలక భూమిక వహించారు. దేవెగౌడ కుటుంబంతో ఉన్న రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా చూసుకొని సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు తన వంతు సహకారం అందించారు. 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత పార్టీ అనేక ఒడుదొడుకులు ఎదుర్కొంది. సమర్థ నాయకత్వం అవసరమని భావించిన అధిష్ఠానం పీసీసీ బాధ్యతలను శివకుమార్‌కు కట్టబెట్టింది. కష్టకాలంలో పార్టీ పగ్గాలు అందుకున్న డీకే ఆ బాధ్యతను సమర్థంగా నిర్వహించారు. పార్టీని ఏకతాటిపైకి తెచ్చి బలోపేతం చేశారు. అందుకు ఫలితమే.. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ 135 స్థానాలు గెలుచుకుంది.

సిద్ధరామయ్య విశిష్టతలు

న్యూదిల్లీ: కర్నాటక ముఖ్యమంత్రిగా సిద్ధ రామయ్యను నియమించాలని ఏకాభిప్రాయం కుదిరింది. సిద్ధ రామయ్యకు నాలుగు విశిష్టతలు ఉన్నాయి.

ఒకటి: సిద్ధ రామయ్య ఇంతకు ముందు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అయిదేళ్ల పదవీ కాలం పూర్తి చేయగలిగారు. కర్నాటక ముఖ్యమంత్రిగా ఇంతకు ముందు రెండు సార్లు పనిచేసిన కాంగ్రెస్ నాయకుడు దేవరాజ్ అర్స్ మాత్రమే. అయితే దేవరాజ్ అర్స్ రెండో సారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఆయన రెండేళ్ల కన్నా తక్కువ కాలమే పదవిలో ఉండగలిగారు. ఇందిరా హయాంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు అర్స్ కర్నాటక ముఖ్యమంత్రిగా ఉన్నారు.

రెండు: అయిదేళ్ల పదవికాలం పూర్తి చేయగలిగిన ఒకే ఒక్క వ్యక్తి సిద్ధ రామయ్యే. రామ కృష్ణ హెగ్డే కూడా అధికారంలో ఉంటూ రెండవ సారి అదే పదవిలోకి రాగలిగారు. కానీ హెగ్డే రెండో సారి అధికారంలోకి రాగలిగినా మొదటి సారి 1983 నుంచి 1985 దాకా మాత్రమే ముఖ్యమంత్రిగా ఉండి మధ్యంతర ఎన్నికలు జరిపించారు. 1985లో మళ్లీ ముఖ్యమంత్రి అయినా 1988 వరకే ఆ పదవిలో ఉన్నారు.

మూడు: సిద్ధ రామయ్య ఈ సారి కూడా పూర్తి కాలం కొనసాగితే రెండు సార్లు పూర్తి కాలం పదవిలో ఉన్న ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తిగా చరిత్రకెక్కుతారు. బీఎస్. యెడ్యూరప్ప నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయినా ఒక్క సారి కూడా అయిదేళ్ల పాటు కొనసాగలేదు.

నాలుగు: మొదట జనతా దళ్ (సెక్యులర్) లో ఉండి 2006లో కాంగ్రెస్ లో చేరారు.

కేంద్ర మాజీ మంత్రి కటారియా కన్నుమూత



అంబాలా: కేంద్ర మాజీ మంత్రి, హరియాణాలోని అంబాలా బీజేపీ ఎంపీ రతన్‌లాల్ కటారియా గురువారం ఉదయం మృతిచెందారు. 72 ఏళ్ల కటారియా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చండీగఢ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బీజేపీ తరఫున మూడుసార్లు ఎంపీగా గెలిచిన కటారియా 2019 నుంచి 2021 వరకు కేంద్ర జలశక్తి, సామాజిక న్యాయం, సాధికరత శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. రతన్‌లాల్ కటారియా మృతికి హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ కట్టర్ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఆయన నివాసానికి వెళ్లిన సీఎం కటారియా భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఠాకూర్‌కు సీరజ్ తప్ప మరేమీ పట్టదు

హిమాచల్ మంత్రులు చందర్ కుమార్, జగత్ సింగ్ నేగి విమర్శలు

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని అక్కడి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం విమర్శించింది. ఆయనకు తన సొంత నియోజకవర్గంలో అభివృద్ధి తప్ప మరేమీ పట్టలేదని వ్యాఖ్యానించింది. నాడు సీఎంగా నేడు విపక్ష నేతగా ఠాకూర్ తీరులో ఎటువంటి మార్పు రాలేదని దుయ్యబట్టింది. 'ఠాకూర్ కేవలం సీరజ్ నియోజకవర్గం (మండీ జిల్లా)పైనే పూర్తిగా దృష్టిని కేంద్రీకరించారు. ప్రతిపక్ష నాయకుడిగా ఆయన మళ్లీ అదే చేస్తున్నారు' అని మంత్రులు చందర్ కుమార్, జగత్ సింగ్ నేగి గురువారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో విమర్శించారు. 5,300 టీచర్ల భర్తీకి ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సూకు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. గత బీజేపీ ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించిన పర్యవసానంగా రాష్ట్రంలో ఉద్యోగుల కొరత ఏర్పడిందని విమర్శించారు. 2017 అసెంబ్లీ ఎన్నికలప్పుడు తాము అధికారంలోకి వస్తే రుణ సంస్కృతి అంతమవుతుందని రాష్ట్ర ప్రజలకు బీజేపీ హామీనిచ్చింది కానీ అందుకు భిన్నంగా వ్యవహరించిందని మంత్రులు వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన బీజేపీ రుణ సంస్కృతిని ప్రోత్సహించిందని, రుణభారాన్ని రూ.75వేల కోట్లకు పెంచిందని ఇద్దరు మంత్రులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఉద్యోగానికి భూమి కేసులో రబ్డీదేవిని విచారించిన ఈడీ

న్యూదిల్లీ: ఉద్యోగానికి బదులు భూమి వ్యవహారంతో ముడిపడివున్న మనీ లాండరింగ్ కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్డీదేవిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం విచారించారు. ఆమె ఉదయం 11 గంటలకు సెంట్రల్ దిల్లీలోని దర్యాప్తు సంస్థ కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం గంట భోజన విరామం అనంతరం తిరిగి 2గంటలకు విచారణకు హాజరయ్యారు. ఆర్‌ఎల్‌డీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ భార్య, రబ్డీ దేవి (68) వాంగ్మూలాన్ని పీఎంఎల్‌ఏ చట్టం కింద అధికారులు రికార్డు చేశారు. రబ్డీ దేవి కుమారుడు తేజస్వీ యాదవ్ (బీహార్ ఉపముఖ్యమంత్రి), కుమార్తెలు మిసా భారతి (ఆర్‌ఎల్‌డీ ఎంపీ), చందా యాదవ్, రాగిణి యాదవ్‌లనూ ఈడీ ఇప్పటికే విచారించింది. పాట్నా, ఫుల్వారి షరీఫ్, దిల్లీ-ఎన్‌సీఆర్, రాంచీ, ముంబైలలోని చందా యాదవ్, రాగిణి యాదవ్, హేమా యాదవ్, అబు దోజనా (ఆర్‌ఎల్‌డీ ఎమ్మెల్యే) ఆస్తులను మార్చిలో ఈడీ సోదా చేసింది. అక్రమ సొమ్ము రూ.కోటిని సీజ్ చేసినట్లు సంస్థ అనంతరం వెల్లడించింది.

మహిళల కోసం బస్సు ఆపకుంటే చర్యలు

డ్రైవర్లకు కేజ్రీవాల్ హెచ్చరిక

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని ఒక బస్ స్టాండ్‌లో బస్సు కోసం వేచిచూస్తున్న మహిళల్ని ఎక్కించుకోకుండా వెళ్లిపోయిన ఒక బస్సు డ్రైవర్ తీరుపై దిల్లీ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆ డ్రైవర్‌ని ఉద్యోగంలోంచి సస్పెండ్ చేసినట్టు ప్రకటించింది. దిల్లీలోని ఓ బస్టాండ్‌లో తాజాగా చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీంతో దిల్లీ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. వీడియోలో రికార్డయిన దృశ్యాలను గమనిస్తే ముగ్గురు మహిళలు ఒక బస్ స్టాప్‌లో వేచి చూస్తున్నారు. బస్సులోని ప్రయాణికుడిని దించేందుకు బస్సును నెమ్మదిగా పోనిచ్చిన డ్రైవర్ అక్కడ బస్సు వెనుక పరుగులు పెడుతున్న మహిళల్ని ఎక్కించుకోకుండానే వెళ్లిపోయినట్టు ఆ వీడియోలో రికార్డయింది. ఈ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి రావడంతో ఆ డ్రైవర్‌ను గుర్తించి సస్పెండ్ చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను దిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ తన ట్విటర్‌లో షేర్ చేశారు. కొందరు డ్రైవర్లు మహిళా ప్రయాణికుల కోసం బస్సు ఆపడంలేదని.. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటి నుంచి బస్సు డ్రైవర్లు వారిని చూసినా బస్సులు ఆపకుండా వెళ్తుండటంపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇలాంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు. నిర్దిష్ట బస్ స్టాప్‌లలో కచ్చితంగా బస్సులు ఆపాల్సిందేనని మహిళా, పురుష డ్రైవర్లను ఆదేశిస్తూ ట్వీట్‌చేశారు. సీఎం చేసిన ట్వీట్‌ను జత చేస్తూ దిల్లీ రవాణా శాఖ మంత్రి కైలాశ్ గెహ్లాట్ స్పందించారు. ఇలాంటి ఘటనలకు సంబంధించి వీడియోలను తీసి వాటిని ప్రభుత్వానికి పంపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ప్రవర్తన ఆమోద యోగ్యం కాదన్న ఆయన ఇలా ప్రవర్తించిన డ్రైవర్, ఇతర సిబ్బందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఎం కేజ్రీవాల్ ఆదేశాల మేరకు డ్రైవర్‌ను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు విధుల నుంచి తొలగించినట్టు చెప్పారు. డ్రైవర్, ఇతర సిబ్బందిపై విచారణ ప్రారంభించినట్టు వెల్లడించారు.

జ్ఞానవాపిలో 'శివలింగం' శాస్త్రీయ సర్వే

మసీదు కమిటీ పిటిషన్‌పై విచారణకు సుప్రీం అంగీకారం

న్యూదిల్లీ: గత ఏడాది వారణాసిలోని జ్ఞానవాపి మసీదు సముదాయంలో కనుగొనబడిన శివలింగంపై శాస్త్రీయంగా సర్వే చేయడానికి అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ జ్ఞానవాపి మసీదు నిర్వహణ కమిటీ చేసిన అప్పీల్‌పై శుక్రవారం విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ పిటిషన్‌ను త్వరగా విచారించాలని జ్ఞానవాపి మసీదు నిర్వహణ కమిటీ తరఫున సీనియర్ అడ్వకేట్ హుజెఫా అహ్మది భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరారు. అప్పీలు పెండింగ్‌లో ఉండగా అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, తీర్పు రిజర్వు అయ్యి పెండింగ్‌లో ఉన్నపుడు కార్బన్ డేటింగ్ కోసం మరో దరఖాస్తు దాఖలు చేశారని చెప్పారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపేందుకు సీజేఐ మొగ్గు చూపారు. కానీ అదే రోజు శాస్త్రీయ సర్వే ప్రారంభమవుతుందని హుజెఫా చెప్పడంతో, దీనిపై శుక్రవారం (మే 19న) విచారణ జరుపుతామని చెప్పారు. అంతకుముందు హిందూ పక్షం కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై కెవియట్ దాఖలు చేసింది. హైకోర్టు మే 12న ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలయ్యే పిటిషన్లపై తమ వాదన వినకుండా ఎటువంటి ఆదేశాలను జారీ చేయరాదని కోరింది.

హైకోర్టు ఏం చెప్పిందంటే?

లక్ష్మీ దేవి, మరి కొందరు దాఖలు చేసిన సివిల్ రివిజన్ పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు మే 12న ఆదేశాలు జారీ చేసింది. 2022 అక్టోబరు 14న కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసింది. మే 22న వారణాసి జిల్లా కోర్టులో హాజరుకావాలని భారత ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ)ను ఆదేశించింది. జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో కనిపించిన శివలింగం వయసును శాస్త్రీయంగా నిర్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పింది. దీని కోసం శాస్త్రీయ విచారణ మాత్రమే కాకుండా కార్బన్ డేటింగ్ కూడా నిర్వహించాలని తెలిపింది. సర్వే సందర్భంగా నిర్మాణానికి ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని ఏఎస్ఐని హైకోర్టు కోరింది. శివలింగానికి కార్బన్ డేటింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హిందూ పక్షం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరవింద్ కుమార్ మిశ్రాతో కూడిన సింగిల్ బెంచ్ స్పందించింది. ఏఎస్ఐ తన నివేదికను సీలు వేసిన కవరులో సమర్పించింది. గత ఏడాది నిర్వహించిన వీడియోగ్రాఫిక్ సర్వేలో ఈ శివలింగం బయటపడిన సంగతి తెలిసిందే. అయితే ఇది శివలింగం కాదని, ఫౌంటెన్ అని ముస్లిం పక్షం వాదిస్తోంది.

బీహార్‌లో కులగణన

హైకోర్టు ఆదేశాలపై స్టే మంజూరుకు సుప్రీం తిరస్కృతి

న్యూదిల్లీ: బీహార్ ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనను నిలిపివేసిన పాట్నా హైకోర్టు ఆదేశాలపై 'స్టే' ఇచ్చేందుకు సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. సర్వే ముసుగులో ఈ జనాభా గణన కసరత్తు చేస్తున్నట్లయితే దీనిని పరిశీలించాల్సి ఉంటుందని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, రాజేష్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'ఇది మీకు మధ్యంతర ఉపశమనం కలిగించే సందర్భం కాదని మేము స్పష్టం చేస్తున్నాము' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

ప్రధాన పిటిషన్‌పై విచారణను జులై 3కి హైకోర్టు వాయిదా వేసినట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఈ పిటిషన్‌ను జూలై 14న జాబితా చేయవలసిందిగా మేము నిర్దేశిస్తున్నాము... ఏదైనా కారణం చేత తదుపరి తేదీకి ముందుగా రిట్ పిటిషన్‌పై విచారణ ప్రారంభం కాకపోతే, పిటిషనర్ (బీహార్) తరఫు సీనియర్ న్యాయవాది కాన్వాస్ చేసిన తదుపరి సమర్పణను మేము వింటాము' అని ధర్మాసనం స్పష్టం చేసింది. మే 4న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాల్ చేస్తూ బీహార్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అప్పీల్‌లో... హైకోర్టు 'స్టే'...మొత్తం జనాభా గణన కసరత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16 ప్రకారం కుల ఆధారిత డేటాను సేకరించడం రాజ్యాంగ ఆదేశమని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. బీహార్‌లో మొదటి రౌండ్ కులాల సర్వే జనవరి 7 - 21 మధ్య నిర్వహించగా, రెండవ రౌండ్ ఏప్రిల్ 15 న ప్రారంభమైంది. ఇది మే 15 వరకు కొనసాగాల్సి ఉంది.

బెంగాల్‌లో 'కేరళ స్టోరీ' నిషేధంపై సుప్రీం స్టే

ప్రేక్షకులకు భద్రత కల్పించాలని తమిళనాడు ప్రభుత్వానికి ఆదేశం



న్యూదిల్లీ: పశ్చిమబెంగాల్‌లో 'ది కేరళ స్టోరీ' చిత్రంపై నిషేధం విధిస్తూ రాష్ట్రప్రభుత్వం మే 8వ తేదీన వెలువరించిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు నిలిపివేసింది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఉత్తర్వులపై స్టే విధించిన సుప్రీం కోర్టు... శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సి) సర్టిఫికేట్ మంజూరు చేసినందున శాంతిభద్రతల పరిరక్షణ రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. తమిళనాడులో భద్రతా కారణాల దృష్ట్యా సినిమా ప్రదర్శనను నిలిపివేయాలని థియేటర్ యజమానులు నిర్ణయించడంతో సినిమా ప్రేక్షకులకు భద్రత కల్పించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోరింది. 'మేము పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఉత్తర్వుపై స్టే విధించాలనుకుంటున్నాము. తమిళనాడుకు సంబంధించి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నిషేధించవద్దని మేము వారికి నిర్దేశిస్తాము' అని ధర్మాసనం పేర్కొంది. 'మే 20 సాయంత్రం 5 గంటలలోపు సినిమాకు సంబంధించి ఓ డిస్‌క్లెయిమర్ (సంబంధం లేదని ప్రకటించడం) వేయాలని, 32వేల మంది హిందూ, క్రిస్టియన్ మహిళలను ఇస్లాంలోకి మార్చారనే వాదన కేవలం ఊహాజనితమని, దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక డేటా లేదని చెప్పండి' అని ధర్మాసనం నిర్మాతలను ఆదేశించింది. కాగా పశ్చిమ బెంగాల్‌లో 'ది కేరళ స్టోరీ' చిత్రంపై నిషేధం విధిస్తూ మమత బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లుతుందని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సినిమా ప్రదర్శనపై నిషేధం విధించింది. అయితే పశ్చిమ బెంగాల్, తమిళనాడులో తమ సినిమాపై నిషేధాన్ని తొలగించాలని కోరుతూ 'ది కేరళ స్టోరీ' నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే గత విచారణలో 'ది కేరళ స్టోరీ' సినిమాను ఎందుకు నిషేధించారని, పశ్చిమ బెంగాల్, తమిళనాడు ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ప్రశ్నించిన సంగతి విదితమే. ఏ కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారో వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. సినిమా ప్రదర్శితమయ్యే సినిమా థియేటర్లకు తగిన భద్రత కల్పించేందుకు తీసుకున్న చర్యల గురించి తమిళనాడు ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం వివరణ కోరింది. కాగా 'ది కేరళ స్టోరీ' సినిమా ట్రైలర్ విడుదలతోనే వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ఇక అదా శర్మ నటించిన ఈ చిత్రం మే5న సినిమా థియేటర్లలో విడుదలైంది.

రూ.2.4 లక్షల కోట్ల నష్టం

ఎల్ఐసీ లిస్టింగ్‌కు ఏడాది



న్యూదిల్లీ: ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయి ఏడాదైంది. గతేదాది మే 17న లిస్టైన ఎల్ఐసీ తొలి రోజే మదుపరులను నిరాశపరిచింది. ఆ తర్వాత కోలుకున్న దాఖలాల్లేవు. ఈ ఏడాదిలో ఏ ఒక్క రోజూ ఇష్యూ ధరను తాకలేదు. లాభాలు లేకపోగా ఎల్ఐసీ మదుపరులకు రూ.2.4 లక్షలకోట్ల నష్టం వచ్చింది. ఎల్ఐసీలో 3.5 శాతం వాటాకు సమానమైన 22.13 కోట్ల షేర్లను ప్రభుత్వం జారీ చేసింది. ఇష్యూ ధరను రూ.949గా ప్రభుత్వం పేర్కొంది. సరిగ్గా ఇదే రోజు లిస్టయిన ఎల్ఐసీ 8 శాతం రాయితీతో మార్కెట్‌లో అడుగుపెట్టింది. బీఎస్ఈలో రూ.867.20 వద్ద, ఎన్ఎస్ఈలో రూ.872 వద్ద లిస్ట్ అయింది. ఆ తర్వాత షేరు విలువ పడుతూనే ఉంది. బుధవారం (మే 17) రూ.568.25 వద్ద ట్రేడైంది. ఇష్యూ ధరతో పోలిస్తే 40 శాతం నష్టపోయింది. ఈ ఏడాదిలో ఏ ఒక్క రోజూ ఇష్యూ ధరకు దరిదాపుల్లోకి ఎల్ఐసీ రాకపోవడం గమనార్హం. ఐపీఓ సమయంలో ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ.6లక్షల కోట్లుగా లెక్కగట్టారు. ప్రస్తుతం ఆ విలువ రూ.3.6 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే ఇన్వెస్టర్లకు రాబడి ఇవ్వకపోగా.. రూ.2.4 లక్షల కోట్ల నష్టాన్ని ఎల్ఐసీ మిగిల్చింది. నవంబర్-జనవరి మధ్య ఓ దశలో రూ.600-700 స్థాయికి ఎల్ఐసీ షేరు ధర చేరినప్పటికీ.. అదానీ వ్యవహారం తర్వాత మళ్లీ పూర్వ స్థితికి చేరడం గమనార్హం. కొన్ని రోజులుగా రూ.550 స్థాయికి అటూ ఇటుగా ట్రేడవుతోంది. ఎల్ఐసీ లిస్టయిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆ స్థాయికి చేరకపోవడానికి చాలా కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. జీవిత బీమా రంగంలో ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీనే మార్కెట్ లీడర్. లాభాలు మాత్రం అంత గొప్పగా లేవు. మదుపరులు ఆసక్తి చూపకపోవడానికి ఇది కూడా కారణమేనని విశ్లేషకులు తెలిపారు. ఎల్ఐసీ ఐపీఓ ద్వారా రూ.21 వేలకోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఐపీఓ సబ్‌స్క్రిప్షన్‌కు ఆరు రోజుల గడువు ఇవ్వగా ఐపీఓకు మూడు రెట్లు మాత్రమే స్పందన వచ్చింది. దీనికితోడు లిస్టయిన తొలిరోజే నష్టాలు రావడం సెంటిమెంట్‌ను దెబ్బతీసిందన్నది నిపుణుల అభిప్రాయం. కరెక్షన్‌కు గురైన ప్రతిసారీ ఈ తరహా కౌంటర్‌లలో అమ్మకాల ఒత్తిడి సహజం అని విశ్లేషకులు పేర్కొన్నారు. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారం కూడా ఎల్ఐసీ షేరు ధర పెరగకపోవడానికి కారణమన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక అనంతరం అదానీ గ్రూప్ కంపెనీ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఎల్ఐసీ పెట్టుబడుల విలువ పడిపోయింది. ఆ ప్రభావం ఎల్ఐసీ స్టాక్ ధరపై ప్రభావం చూపిందని మార్కెట్ నిపుణులు వెల్లడించారు.

'మోదానీ' వల్లే: కాంగ్రెస్

ఎల్ఐసీ లిస్టింగ్‌కు ఏడాది అయిన సందర్భంగా ఆ సంస్థ విలువ రూ.5.48లక్షల కోట్ల నుంచి రూ.3.59 లక్షల కోట్లకు పడిపోవడానికి కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్విట్టర్‌లో తనదైన శైలిలో మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు.

'మోదానీ' వల్లే ఎల్ఐసీ విలువ పడిపోయిందని, తద్వార లక్షలాది మంది పాలసీదారులకు నష్టం వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ ఐటీ శాఖాధిపతి అమిత్ మాళవియా తోసిపుచ్చారు. అదానీ స్టాక్స్‌లపై ఎల్ఐసీకి లాభాలొచ్చాయని, పాలసీదారులకు ఎలాంటి ప్రమాదం లేదని ఎల్ఐసీ చీఫ్ చెప్పారన్నారు. సగం-సగం సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించడంలో జైరాం రమేశ్ దిట్టని విమర్శించారు. కాగా అదానీ గ్రూపులో ఎల్ఐసీ వాటాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. హిండెన్‌బర్గ్ నివేదిక ఆధారంగా అదానీ గ్రూపుపై జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తోంది.

జూన్ 19న కలెక్టరేట్ల వద్ద

నేతన్నల ధర్నా

చేనేత ఐక్య కార్యాచరణ రాష్ట్ర కమిటీ తీర్మానం

విశాలాంధ్ర- చీరాల: చేనేత సమస్యలపై జూన్ 19న కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాల నిర్వహించనున్నట్లు చేనేత ఐక్య కార్యాచరణ రాష్ట్ర కమిటీ తీర్మానించింది. బాపట్ల జిల్లా చీరాల అంబేద్కర్ భవన్‌లో చేనేత సమస్యలపై రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మేడ వెంకట్రావు,శీలం వెంకటేశ్వర్లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన చేనేత ప్రతినిధులు రాష్ట్రవ్యాప్త ఉద్యమం నిర్మించాలని ఏకగ్రీవ తీర్మానించారు. చేనేత వస్త్ర నిల్వలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి నేతన్నలకు పని కల్పించడంలో బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి చేనేత కార్మికునికి, చేనేత వృత్తిపై ఆధారపడిన ఉపవృత్తుల వారికి వర్తింపజేయాలని అన్నారు. చేనేతపై జీఎస్టిని తక్షణం రద్దు చేయాలన్నారు. యారన్, పట్టు, జరీ,రంగులు, రసాయనాల ధరలను 2021 నాటి ధరలకు తగ్గించాలని కోరారు. బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.25 వేల కోట్లు చేనేతకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు, ప్రభుత్వ విద్యాసంస్థలలో బాల బాలికలకు చేనేత వస్త్రాలను సరఫరా చేయాలని కోరారు. చేనేత కార్మిక కుటుంబానికి మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇంటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెల్లూరులోని ఆరు ఎకరాల 90 సెంట్లు ఆప్కో స్థలాన్ని తిరిగి ఆప్కోకు ఇవ్వాలని, ఆప్కో స్థలాన్ని ఇతరులకు కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా ఆప్కో స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చేనేతలకు దక్కే విధంగా చూడాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటీయూసీ) నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు,గొట్టిముక్కల బాలాజీ,మురుగుడు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, చేనేత ఐక్యవేదిక సంఘం జాతీయ అధ్యక్షులు అవ్వరు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షులు నీలూరు రుషింగప్ప, ప్రధాన కార్యదర్శి చింతా నాగేశ్వరరావు, ఎం నాగరాజు, చేనేత జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మాచర్ల మోహనరావు, దేవనవీర నాగేశ్వరరావు, మునగాల వెంకటేశ్వర్లు, చేనేత కాంగ్రెస్ నాయకులు రామనాథం పూర్ణచంద్రరావు,మాజీ శాసనమండలి సభ్యులు బూదాటి రాధాకృష్ణయ్య, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు వార్త కోట సుబ్బారావు, పింజల భూషణ్ బాబు, ఆకురాతి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.డిమాండ్ల సాధన కోసం జూన్ 19న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని తీర్మానించారు. రాష్ట్ర కమిటీ తరఫున ప్రభుత్వానికి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. బాపట్ల,గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు,అనంతపురం, కర్నూలు, అన్నమయ్య జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో ఉద్యమ కార్యాచరణ నిర్వహణకై వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో రాష్ట్రస్థాయి చేనేత ఐక్య కార్యాచరణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. న్యాయవాది వై.కోటేశ్వరరావును రాష్ట్ర కన్వీనర్‌గా, వివిధ చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులను కో కన్వీనర్లుగా ఎన్నుకున్నారు.

మాలెంపాటి పోరాటస్ఫూర్తిని నేటి తరానికి అందించాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి
- ఘనంగా బాలభాస్కరరావు శతజయంతి

విశాలాంధ్ర - చల్లపల్లి: చల్లపల్లి జమిందారీ వ్యతిరేక భూపోరాటాల్లో ప్రముఖ పాత్రపోషించి వెన్నుచూపని వీరునిగా, ప్రాణాలను సైతం లెక్కచేయని ధీరుడు మాలెంపాటి బాల భాస్కరరావు పోరాటస్ఫూర్తి నేటి తరానికి ఎంతో అవసరమనీ, ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. కృష్ణలంకల భూపోరాటయోధుడు అమరజీవి మాలెంపాటి బాలభాస్కరరావు శతజయంతి ఉత్సవాన్ని కృష్ణా జిల్లా చల్లపల్లి లోని చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, చల్లపల్లి ప్రాంతం ఉద్యమ చరిత్రను లిఖించిందనీ, తెలంగాణ సాయుధ పోరాటానికి ఈ ప్రాంతవాసులు ఎంతో సహకారం అందించారని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమ స్ఫూర్తి, భూపోరాట స్ఫూర్తి నేడు ఎంతో అవసరమనీ, రైతాంగాన్ని, పేదలను నిర్వీర్యం చేసేలా ముందుకుసాగుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం చేయాల్సి ఉందన్నారు. దేశంలో పేదరికం పోయేంతవరకూ కమ్యూనిస్టు ఉద్యమం కొనసాగుతూ ఉంటుందని స్పష్టం చేశారు. చల్లపల్లి జమిందారీ వ్యతిరేక భూపోరాట ఉద్యమం పేదలకు భూమిని అందించిందన్నారు. ప్రాణాలకు ఆపద ఉందని తెలిసినా చివరి వరకూ పేదలకోసం పోరుసల్పిన బాలభాస్కరరావు జీవితం ఆదర్శమన్నారు. భూపోరాటం అంటే ముందుగా గుర్తుకువచ్చేది చంద్ర రాజేశ్వరరావు అనీ, మంగళాపురం నుంచి సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ కష్టజీవుల కోసం చివరి వరకు పోరాడిన మహనీయుడు బాల భాస్కర రావు అని శ్లాఘించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో దేశంలో దారిద్ర్యం తాండవిస్తున్నదని విమర్శించారు. చదువుకున్న నిరుద్యోగులకు నూటికి 33 మందికి ఉద్యోగాలు లేవని, దాని గురించి చర్చించకుండా బీజేపీ ప్రభుత్వం రాముడు గొప్ప అల్లా గొప్ప అంటూ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పాలన సాగిస్తున్నదన్నారు. కరోనా తర్వాత దేశంలో పేదరికం విపరీతంగా పెరిగిందని తెలిపారు. ఒకపక్క దేశంలో సంపద తగ్గుతుంటే మరోపక్క వంద మంది ధనవంతులకు మాత్రం 16 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో నిరంకుశత్వం పరిపాలన సాగుతోందని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అదానీ అంబానీలు లక్షల కోట్లకు పడగలెత్తారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ... అభివృద్ధిని మర్చిపోయారని విమర్శించారు.

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశరరావు, సహాయ కార్యదర్శి టి.తాతయ్య, మహిళా సమాఖ్య సీనియర్ నాయకులు దేవభక్తుని నిర్మల, విశాఖ కోఆపరేటీవ్ బ్యాంకు డైరెక్టర్ చిన్నం కోటేశ్వర రావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు మాట్లాడారు. ప్రజానాట్యమండలి నాయకులు ఆర్.పిచ్చయ్య, మలిపెద్ది రాజా, శేషు ఆలపించిన విప్లవ గేయాలు ఆహూతులు నాకట్టుకున్నాయి. గ్రామస్తులు, సీపీఐ నేతలు, కార్యకర్తలు తొలుత నిమ్మగడ్డ నుంచి ప్రభలతో ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బాలభాస్కరరావు జీవితచరిత్ర పుస్తకాన్ని జేవీ సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. బాలభాస్కరరావు స్థూపం, చిత్రపటాల వద్ద పూలమాలు వేసి నివాళులు అర్పించారు.

దేశం నలుమూలలకు సాంకేతికత

- ప్రధాని నరేంద్రమోదీ
- ఒడిశాలో తొలి వందేభారత్ రైలు ప్రారంభం

పూరి/హౌరా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఒడిశాలో రూ. 8,200 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అలాగే ఒడిశా మొదటి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. ఈ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఒడిశాలోని పూరీ- పశ్చిమ బెంగాల్‌లోని హౌరా మధ్య దౌడు తీయనుంది. ఈ కార్యక్రమంలో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పూరి స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ... నవ భారతదేశం తన సొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని నిర్మిస్తోందని, వాటిని దేశంలోని వివిధ మూలలకు చేరుస్తోందని అన్నారు. 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్.. హౌరా, పూరి మధ్య మత, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది' అని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం దేశంలో పదిహేను వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, అవి సంధాయకత, ఆర్థిక వ్యవస్థ రెండింటినీ పెంపొందిస్తున్నాయని చెప్పారు. ఒకప్పుడు కొత్త టెక్నాలజీలు, సౌకర్యాలు ఢిల్లీ లేదా పెద్ద నగరాలకే పరిమితమయ్యేవని, ఇప్పుడు భారతదేశం తనంతట తానుగా సాంకేతికతలను తయారు చేసుకుంటోందని, దేశంలోని వివిధ మూలలకు అది చేరుకుంటోందని వందే భారత్ రైలును ఉద్దేశించి ప్రధాని చెప్పుకొచ్చారు. దేశం స్వాతంత్ర్యానికి సంబంధించిన "అమృత్ కాల్" జరుపుకుంటున్న తరుణంలో దేశ ఐక్యతను మరింత పటిష్టం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ప్రధాని మోదీ అన్నారు. దేశ ఐక్యత ఎంత బలపడితే... దేశ సమష్టి సామర్థ్యం అంతగా పెరుగుతుందని చెప్పారు. 'అత్యంత సవాళ్ల మధ్య కూడా భారతదేశం తన అభివృద్ధి ప్రయాణాన్ని చెక్కుచెదరకుండా ఉంచింది. దీని వెనుక అన్ని రాష్ట్రాల భాగస్వామ్యం, ఐక్యంగా ముందుకు సాగాలనే భారతదేశ స్ఫూర్తి ఉంది' అని మోదీ అన్నారు. పూరి, కటక్ రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధికి మోదీ శంకుస్థాపన చేశారు. ఒడిశాలోని రైల్వే నెట్‌వర్క్‌కు 100 శాతం విద్యుద్దీకరణను మోదీ జాతికి అంకితం చేశారు. దీంతో నిర్వహణ వ్యయం తగ్గుతుందని, దిగుమతి చేసుకునే ముడి చమురుపై ఆధారపడటం తగ్గుతుందని అధికారులు తెలిపారు. కాగా పూరీ-హౌరా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఈ మార్గంలో అత్యంత వేగవంతమైన రైలు అని, దాదాపు ఆరున్నర గంటల్లో 500 కి.మీ దూరాన్ని చేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. మరోవైపు పశ్చిమ బెంగాల్‌లో రెండోది అయిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్నందుకు గుర్తుగా హౌరా స్టేషన్‌లో సాంస్కృతిక కార్యక్రమం కూడా నిర్వహించారు. 22895/22896 హౌరా-పూరి-హౌరా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్‌గా మే 20 నుంచి ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. గురువారం మినహా వారంలో ఆరు రోజులు నడిచే ఈ రైలు హౌరాలో ఉదయం 6.10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.35 గంటలకు పూరీకి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీలో మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరి రాత్రి 8.30 గంటలకు హౌరా చేరుకుంటుంది. 16 కోచ్‌లతో కూడిన ఈ రైలు ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్ కియోంజర్ రోడ్, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్‌లలో ఆగుతుంది.

బ్రో:ది అవతార్‌గా పవన్ కల్యాణ్

హైదరాబాద్: పవన్ కల్యాణ్, సాయిధరమ్ తేజ్ ప్రధాన పాత్రలుగా సముద్రఖని దర్శకత్వం వహిస్తున్న 'వినోదయ సిత్తం' రీమేక్‌గా వస్తున్న సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. తెలుగు నేటివిటీకి తగ్గట్లు త్రివిక్రమ్ కథలో పలు మార్పులు చేర్పులు చేశాడు. ఇప్పటికే సెట్స్ నుంచి లీకైన ఫోటోలు నెట్టింట దుమారం రేపాయి. ఈ సినిమాలో పవన్ కల్యాణ్ మనిషి రూపంలో ఉన్న దేవుడిగా కనిపించనున్నాడు. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదలైంది. ఈ సినిమాకు 'బ్రో:ది అవతార్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ మేకర్స్ పవన్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో పవన్ స్టయిలిష్ లుక్‌లో మంచి ఎనర్జిటిక్‌గా కనిపిస్తున్నాడు. ఈ పోస్టర్‌తో పవన్ ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. టైటిల్ మోషన్ పోస్టర్‌లో నేపథ్య సంగీతం గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. బ్రో టైటిల్‌లో టైమ్‌ను కూడా ప్రజెంట్ చేస్తూ ఈ సినిమా థీమ్‌ను చెబుతున్నారు. ఒక యాక్సిడెంట్‌లో చనిపోయిన ఓ వ్యక్తి.. తాను చేయాల్సిన పనులు కొన్ని ఉన్నాయని, దానికి మూడు నెలలు సమయం కావాలని తననీ పైకి తీసుకెళ్లడానికి వచ్చిన దేవుడిని ఓ వరం అడుగుతాడు. దానికి దేవుడు ఒప్పుకోవడమే కాకుండా ఆ మూడు నెలలు ఇక్కడే ఉండి ఆ వ్యక్తితో ప్రయాణిస్తాడు. ఆ తర్వాత ఏం జరిగింది? చనిపోయిన వ్యక్తి తాను అనుకున్న పనులను పూర్తి చేశాడా? అనే కథాంశంతో సాగుతుంది. ఇప్పటికే పవన్ షూటింగ్ పూర్తయిపోయిందని సమాచారం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ సినిమా జూలై 28న ప్రేక్షకుల ముందుకు రానుంది.

వంద కోట్ల క్లబ్‌లో 'విరూపాక్ష'



హైదరాబాద్:సాయి ధరమ్ తేజ్ చాలా కాలం తర్వాత 'విరూపాక్ష'తో తిరుగులేని కంబ్యాక్ ఇచ్చాడు. నాలుగు వారాల క్రితం రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర కోట్లు కొల్లగొట్టింది. ఇప్పటికీ ఈ సినిమా కలెక్షన్‌లు స్టడీగానే ఉన్నాయి. చాలా కాలం తర్వాత మంచి థ్రిల్లర్ మూవీ రావడంతో ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా బాగా సపోర్ట్ చేశారు. ఇటీవలే హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలై అక్కడ కూడా మంచి కలెక్షన్‌లు రాబడుతుంది. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా తాజాగా అరుదైన ఘనత సాధించింది. విరూపాక్ష మూవీ వంద కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టింది. ఇక సాయి ధరమ్ తేజ్‌కు తొలి వంద కోట్ల సినిమా ఇదే కావడం విశేషం. ఈ మేరకు మేకర్స్ ఓ స్పెషల్ వీడియోను అభిమానులతో పంచుకున్నారు. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో సాయి తేజ్‌కు జోడీగా సంయుక్త మీనన్ నటించింది. ఇక దర్శకుడిగా కార్తిక్ దండూ తొలి ప్రయత్నంలోనే మంచి విజయం సాధించాడు. తొలి సినిమాకే ఈ రేంజ్‌లో అవుట్ పుట్ ఇచ్చాడంటే మాములు విషయం కాదు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించాయి.

మేము ఫేమస్ ట్రైలర్ విడుదల

హైదరాబాద్: తెలంగాణ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో, తమను తాము ఎలాగైనా నిరూపించుకోవాలని సాగే కథతో పని పాటలేని ముగ్గురు కుర్రాళ్ల కథే మేము ఫేమస్. వాళ్లను ఇంట్లో వాళ్లే కాదు ఊర్లోని తిట్టని వారుండరు. అలా సరదాగా జీవితాన్ని గడిపేస్తున్న ఈ కుర్రాళ్ల జీవితంలోకి సమస్యలు వచ్చి పడుతాయి. ఆ సమస్యలను వీళ్లు ఎలా అధిగమించారు, వీళ్లు ఎలా సక్సెస్ అయ్యారు. ఈ సక్సెస్ వీళ్లను ఎంత ఫేమస్ చేసింది అనేది కథ అని ట్రైలర్‌తో చిత్రబృందం స్పష్టం చేసింది. ఈ సినిమాను యూట్యూబ్ స్టార్ సుమంత్ నటిస్తూ, దర్శకత్వం వహించాడు. ఇక ట్రైలర్‌లో తెలిసిన మొహాలు చాలా తక్కువగా ఉన్నప్పటికి అనుభవం ఉన్న నటులుగా పర్‌ఫార్మ్ చేసినట్లు ట్రైలర్‌లో కనిపిస్తుంది. కొన్ని చోట్ల జాతిరత్నాలు వైబ్స్ కనిపిస్తున్నాయి. చాయ్ బిస్కెట్ ఫిలింస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాను అల్లు అరవింద్ విడుదల చేస్తున్నాడు.

దనుష్క గుణతిలకపై కేసుల ఎత్తివేత



మెల్‌బోర్న్: లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీలంక క్రికెటర్ దనుష్క గుణతిలకకు ఊరట లభించింది. అతడిపై నమోదైన నాలుగు కేసుల్లో మూడింటిని ఆస్ట్రేలియాలోని సిడ్నీ కోర్టు కొట్టి వేసింది. తగిన ఆధారాలు లేకపోవడంతో దనుష్కపై నమోదైన 3 కేసులు చెల్లవని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెల్లడించారు. దనుష్క లైంగిక దాడికి పాల్పడ్డాడని సదరు మహిళ పెట్టిన నాలుగు లైంగిక దాడి కేసుల్లో ఒక్కటి మాత్రమే నిలుస్తుందని, మిగతా మూడు కేసులు చెల్లవని ప్రభుత్వ న్యాయవాది హగ్ బుడ్డిన్ కోర్టుకు వెల్లడించాడు. దీంతో ఈ 32 ఏళ్ల శ్రీలంక ఆటగాడు ఊపిరి పీల్చుకున్నాడు. పోయిన ఏడాది టీ20 వరల్డ్ కప్ సమయంలో ఒక మహిళ దనుష్కపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన అంగీకారం లేకుండానే అతడు తనపై లైగింక దాడి చేశాడని ఆమె పేర్కొంది. దాంతో జట్టు సభ్యులతో టీమ్ హోటల్‌లో ఉన్న దనుష్కను పోలీసులు అరెస్ట్ చేశారు. 'సదరు మహిళతో దనుష్కకు డేటింగ్ యాప్‌లో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ డేట్‌కు వెళ్లారు. అనంతరం సిడ్నీలోని రాస్ బేలో ఉన్న ఆమె ఇంటికి వెళ్లారు. అక్కడ అతడు బలవంతంగా ఆమెపై అత్యాచారం చేశాడు' అని పోలీసులు తమ రిపోర్టులో తెలిపారు. టాపార్డర్ బ్యాటర్ అయిన దనుష్క గుణతిలక రెండు సార్లు నిషేధానికి గురయ్యాడు. 2018లో టీమ్ కర్ఫ్యూను ఉల్లంఘించినందుకు అతడిపై 6 నెలలు నిషేధం విధించారు. అదే ఏడాది దనుష్క స్నేహితుడు నార్వే మహిళపై అత్యాచారం చేయడంతో జట్టు నుంచి సస్పెండ్ అయ్యాడు. ఆ తర్వాత 2021లో ఇంగ్లండ్ పర్యటన సమయంలో అతను బయో సెక్యూర్ బబుల్ నిబంధనలను ఉల్లంఘించాడు. దాంతో, అతడితో పాటు కుశాల్ మెండిస్, నిరోషన్ డిక్‌వెల్లాను శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెండ్ చేసింది. దనుష్క శ్రీలంక జాతీయ జట్టు తరపున 8 టెస్టులు, 47 వన్డేలు, 46 టీ20 మ్యాచుల్లో ఆడాడు.

గాయం తర్వాత మరింత దూకుడుగా మ్యాక్స్‌వెల్

బెంగళూరు: సాధారణంగా గాయం తర్వాత, ఏ ఆటగాడైనా తిరిగి గాడిలో పడటానికి ఎంతో కొంత సమయం తీసుకుంటారు. కానీ ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నాడు. నాలుగు నెలలకు గ్రౌండ్‌కు దూరమైన ఆ స్టార్ క్రికెటర్... తిరిగొచ్చాక మాత్రం చెలరేగి పోతున్నాడు. గతేడాది మెల్‌బోర్న్‌లో జరిగిన బర్త్‌డే వేడుకల్లో జారిపడ్డ సంఘటనలో మాక్స్‌వెల్ కాలు విరిగింది. గాయం కారణంగా చాలా కాలంపాటు గ్రౌండ్‌కి దూరంగా ఉన్నాడు. శస్త్రచికిత్స కూడా చేశారు. సుమారు 4 నెలల పాటు మైదానానికి దూరంగా ఉన్న అతను ఫిబ్రవరిలో దేశవాళీ క్రికెట్‌కు తిరిగి వచ్చాడు. వచ్చీ రాగానే పూర్తి భిన్నమైన శైలిలో కనిపించాడు. అనంతరం ఐపీఎల్ ఆడేందుకు భారత్‌కు వచ్చిన మాక్స్‌వెల్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరులో చేరి విధ్వంసక ఆటతీరు ప్రదర్శిస్తున్నాడు. గాయం తర్వాత మ్యాక్స్‌వెల్ మరింత దూకుడు పెంచాడు. ఈ సీజన్‌లో 12 మ్యాచ్‌లు ఆడి 384 పరుగులు చేశాడు. ఈ సమయంలో, అతని స్ట్రైక్ రేట్ 34.91. మొత్తం 5 అర్ధ సెంచరీలు చేశాడు. అతని ఫామ్ చూస్తుంటే అసలు కాలుకు సర్జరీ అయిందా అన్న అనుమానం కలగక మానదు. మాక్స్‌వెల్‌కు బెంగళూరుతో 2021 నుంచి అనుబంధం ఉంది. అప్పటి నుంచి అతని గ్రాఫ్ పెరుగుతూ వచ్చింది. బెంగళూరు జట్టులో చేరడానికి ముందు, మాక్స్‌వెల్ ఐపీఎల్‌లో 154.7 స్ట్రైక్ రేట్‌తో 78 ఇన్నింగ్స్‌లలో 1505 పరుగులు చేశాడు. ఇందులో 6 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 2021లో బెంగళూరులో చేరిన తర్వాత 39 ఇన్నింగ్స్‌ల్లో 1198 పరుగులు చేశాడు. బెంగళూరు జట్టులో చేరిన తర్వాత మాక్స్‌వెల్ ఆటతీరు బాగా మెరుగైంది. గాయం తర్వాత అతని మాట తీరు మరింత మెరుగైంది.

చివరి మ్యాచ్‌లో ప్రత్యేక జెర్సీలో లక్నో జట్టు

లక్నో: ఐపీఎల్ 16వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ అదరగొడుతోంది. ముంబై ఇండియన్స్‌పై అనూహ్య విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది. లక్నో జట్టు మామూలు ముదురు నీలం రంగు జెర్సీతో బరిలోకి దిగుతుంది. అయితే.. మే 20న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో మాత్రం ప్రత్యేకమైన జెర్సీతో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో ఆటగాళ్లు కుంకుమ రంగు జెర్సీ ధరించనున్నారు. ఎందుకంటే కోల్‌కతాలోని ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్ మొహున్ బగన్‌కు నివాళి అర్పించడం కోసం లక్నో ఆటగాళ్లు ఈ ప్రత్యేక జెర్సీ వేసుకోనున్నారు. ఈ మ్యాచ్‌లో లక్నో జట్టు కోల్‌కతాపై గెలిస్తే 17 పాయింట్లతో నేరుగా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది.

ఆర్సీబీని కోహ్లీ ఆదుకుంటాడు: టామ్ మూడీ

బెంగళూరు: ఆర్సీబీ ప్లేఆఫ్స్ రేసులో నిలవడానికి ఆ జట్టు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ తన శక్తి మేరకు అన్నివిధాలా కృషి చేస్తాడని సన్‌రైజర్స్ మాజీ హెడ్ కోచ్ టామ్ మూడీ అన్నాడు. 'ఈ సీజన్ ప్రథమార్థంలో ఆర్సీబీ బాగా ఆడింది. కానీ, ద్వితీయార్థంలో ఆ జట్టు వెనుకబడటంతో వారు తమ మిగిలిన మ్యాచ్‌ల్లో విజయం కోసం వంద శాతం కృషి చేయాల్సిన అవసరముంది. వారికి విరాట్ కోహ్లీ వంటి ఆటగాడు ఉన్నాడు. ఆర్సీబీ ప్లేఆఫ్స్ రేసులో నిలవడానికి కోహ్లీ తన శక్తి మేరకు కృషి చేస్తాడు' అని టామ్ మూడీ ఓ క్రీడా ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో అన్నాడు. కాగా భారత మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ ఆర్సీబీ ఆటతీరు గురించి మాట్లాడుతూ... 'ఆర్సీబీ జట్టుగా ఆడాలని, కేవలం ముగ్గురు ఆటగాళ్లపై (కోహ్లీ, మ్యాక్స్‌వెల్, డుప్లెసిస్) ఆడితే సరిపోదని తెలిపాడు. ఈ సీజన్‌లో బెంగళూరు ఇప్పటివరకు 12 మ్యాచ్‌ల్లో 6 విజయాలు, 6 ఓటములతో ఉంది. ఆ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలవాల్సి ఉంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.